RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 240 మేడ్చల్ మల్కాజ్‌గిరి 21 సెప్టెంబర్ 2024 శనివారం పేజీలు : 4

## ఉక్రెయిన్‌కు భారత ఆయుధాలు?

న్యూఢిల్లీ : భారత్‌లో తయారవుతున్న ఆయుధాలు ఉక్రెయిన్‌కు చేరుతున్నాయా? భారత్ నుంచి ఆయుధాలను దిగుమతి చేసుకునే పలు ఐరోపా దేశాలు.. అక్రమంగా వాటిని ఉక్రెయిన్‌కు అందజేస్తున్నాయా? ఈ అంశంపై రష్యా ఇప్పటికే పలుమార్లు భారత్‌ను అప్రమత్తం చేయగా.. రాయిటర్స్ తాజా నివేదిక ఒకటి ఈ వాదనలను బలపరుస్తోంది. నిజానికి భారత్ దిగుమతి చేసుకునే ఆయుధాల్లో 60% రష్యాకు చెందినవే. అయితే.. మేకిన్ ఇండియాలో భాగంగా భారత్‌లోని పలు కంపెనీలు తయారు చేస్తున్న ఆయుధాలు, ఆర్టిలరీ షెల్స్, తూటాలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ కోవలో ఐరోపాలోని చెక్ రిపబ్లిక్, ఇటలీ వంటి దేశాలు భారత్ నుంచి షెల్స్‌ను కొనుగోలు చేస్తున్నాయి. ఆ దేశాల నుంచి ఆయుధాలను తీసుకుంటున్న ఉక్రెయిన్.. వాటిని రష్యాతో పోరులో విరివిగా వినియోగిస్తోందని రష్యా ముందునుంచీ ఆరోపిస్తోంది.



## తెలంగాణలో రుణ మాఫీపై... ప్రధాని మోడీ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసపూరిత హామీలు, అసత్యాలేనని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తెలంగాణలో రైతు రుణాలను మాఫీ చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులను మోసం చేసిందని చెప్పారు. దిక్కుతోచని స్థితిలో తెలంగాణ రైతాంగం రుణ మాఫీ కోసం తిరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ రైతులను నిండా ముంచిందని దుయ్యబట్టారు. మహారాష్ట్రలోని వార్ధాలో శుక్రవారం ఓ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇవాళ గతంలోలా లేదని అన్నారు.


ఇవాళ కాంగ్రెస్లో దేశభక్తి స్ఫూర్తి లోపించిందని అన్నారు. విదేశీ గడ్డపై కాంగ్రెస్ నేతలు వాడుతున్న భాషను చూస్తే బాధేస్తోందని చెప్పారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయడం, దేశ సంస్కృతిని అవమానపరచడం వంటి దేశ వ్యతిరేక అజెండాతో ముందుకెళుతున్నారని ఆరోపించారు. తుక్డే తుక్డే గ్యాంగ్, అర్బన్ నక్సల్స్ వంటి వారితో ఇవాళ కాంగ్రెస్ పార్టీ నడుస్తున్నదని అన్నారు. ఇవాళ దేశంలో అత్యంత అవినీతి, నిజాయితీ లేని పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీయేనని మండిపడ్డారు. దేశంలో అత్యంత అవినీతి కుటుంబం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ రాజ కుటుంబమేనని ప్రధాని మోడీ ఆరోపించారు. అవినీతి, కుంభకోణాల్లో కాంగ్రెస్ పార్టీని మించిన వారెవరూ లేరని ప్రధాని ఎద్దేవా చేశారు.



## కాంగ్రెస్‌ది అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్: హరీశ్‌రావు

సిద్దిపేట: కాళేశ్వరం నిర్మాణానికి రూ.93వేల కోట్లు ఖర్చయితే.. రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు.

శుక్రవారం ఆయన మల్లన్న సాగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాళేశ్వరం కొట్టుకుపోయిందని కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెట్టారని.. కాళేశ్వరం కొట్టుకుపోతే మల్లన్నసాగర్‌లోకి నీళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కాళేశ్వరం జలాలతో మల్లన్నసాగర్ నిండు కుండలా ఉందన్నారు. భారాసది వాటర్ డైవర్ట్ పాలిటిక్స్ అయితే.. కాంగ్రెస్‌ది అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్ ఎద్దేవా చేశారు.



## దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్: దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై శుక్రవారం సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 160 ఎకరాలుగా పేర్కొనడంపై ప్రియతమ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత రికార్డుల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధి 65 ఎకరాలుగా ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణను సోమవారానికి వాయిదా వేసిన సీజే ధర్మాసనం.. దీనిపై వివరణ ఇవ్వాలని రెవన్యూ, నీటిపారుదలశాఖ, హెచ్ఎండీఏకు నం నోటీసులు జారీ చేసింది.




## తెలంగాణలో మళ్లీ దంచి కొట్టనున్న వానలు.. ఎల్లో అలర్ట్ జారీ..

హైదరాబాద్ : తెలంగాణలో కాస్త గ్యాప్ తరువాత మళ్లీ వర్షాలు కురవబోతున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నేటి నుంచి రెండు రోజుల పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.ఈ రోజు పెద్దపల్లి, కరీంనగర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగాం, మేడ్చల్ మల్కాజిగిరి, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి తేలిక పాటి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఉదయం ఎండకాసినా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తాయని చెప్పారు.రేపు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, రాజ్నన సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు.

ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. బలమైన ఉపరితల గాలులు గంటకు 30-40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉంటే గత రెండు రోజులుగా తెలంగాణలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు దంచికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ వర్షాలు కురవబోతున్నాయనే విషయం లోతట్టు ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.



# హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ..!

## పలు కీలక నిర్ణయాలు తీసుకున్న తెలంగాణ కేబినెట్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరిగింది. భేటీ అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఉండేలా నిబంధనలు సడలించాం. హైడ్రాకు అవసరమైన సిబ్బందిని వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై రప్పిస్తున్నాం. 169 మంది అధికారులు, 964 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కేటాయింపు. ఓఆర్‌ఆర్ లోపల 27 అర్బన్, లోకల్ బాడీలు ఉన్నాయి. 51 గ్రామ పంచాయతీలను కోర్ అర్బన్‌లో విలీనం. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్ ఖరారుకు కమిటీ ఏర్పాటు. ఆర్‌అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో 12 మందితో కమిటీ. కమిటీ కన్వీనర్‌గా ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ. పోలీసు ఆరోగ్య భద్రత స్కీమ్ ఎస్‌పీఎల్‌కు కూడా వర్తింపు.

మనోహరాబాద్‌లో 72 ఎకరాల్లో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ఆమోదం. 8 వైద్య కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం. 3వేలకు పైగా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్. ఖమ్మం జిల్లాలో 58 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఆమోదం. ఏటూరునాగారం ఫైర్ స్టేషన్‌కు 34 మంది సిబ్బంది మంజూరు. కోస్గి ఇంజినీరింగ్ కళాశాల, హకీంపేటలో జూనియర్ కళాశాల మంజూరు.

**మూడు యూనివర్సిటీల పేర్ల మార్పునకు కేబినెట్ ఆమోదం..!**

తెలంగాణ సచివాలయంలో తాజాగా కేబినెట్ భేటీ అయింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ముఖ్యంగా కోఠి మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ, తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్ రెడ్డి, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్స్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టారు. ఈ మూడు యూనివర్సిటీల యొక్క పేర్ల మార్పునకు తెలంగాణ కేబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. మరోవైపు రేషన్ కార్డుల విధి, విధానాలపై కూడా కేబినెట్ భేటీలో చర్చిస్తున్నారు. అలాగే ఆర్వోఆర్ చట్టం, ఆర్‌ఆర్‌ఆర్, %వాాదీజ% ప్రాజెక్ట్ అంశాలపై కూడా చర్చలు జరుగుతున్నాయి. హైడ్రాకు చట్టబద్ధత కల్పించే అవకాశం కనిపిస్తోంది. వరద సహాయక చర్యలు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, రైతు రుణ మాఫీ, రైతు భరోసా, బీసీ కుల గణన, కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు వంటి అంశాలపై చర్చిస్తున్నారు. ఎజెండా భారీగా ఉన్న నేపథ్యంలో భేటీ సుదీర్ఘంగా కొనసాగనుంది. మరో గంట పాటు కేబినెట్ భేటీ ఉండే అవకాశం కనిపిస్తోంది.

# అర్హులందరికీ రేషన్ కార్డులు

## విధి విధానాలను ఖరారు చేస్తున్న రేవంత్ సర్కార్!

హైదరాబాద్ : కొత్త రేషన్ కార్డుల జారీ కోసం అక్టోబర్ రెండో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రేషన్ కార్డులు జారీకి పటిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రేవంత్ అన్నారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశం ముఖ్యమంత్రితో పాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి డీఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

**డిజిటల్ రేషన్ కార్డులు...** అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు ఇచ్చేందుకు కసరత్తులు మొదలు పెట్టారు.

అయితే ఈ అంశంపై త్వరలోనే మరోసారి సమీక్ష నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి మంత్రివర్గ ఉప సంఘం విధి విధానాలను రూపొందిస్తోంది. ఈ క్రమంలో కుటుంబాల వార్షిక ఆదాయ పరిమితిని కూడా నిర్ణయించనుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో రెండు ఆదాయ పరిమితుల ప్రకారం రేషన్ కార్డులు జారీ చేసేవారు. ఇప్పుడు ఈ ఆదాయ పరిమితిని మార్చాలా లేక ఉన్నదాన్నే కొనసాగించాలా అన్నదానిపై కమిటీ కసరత్తు చేస్తోంది. దీని పై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ నేతృత్వంలో పలువురు అధికారులు గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధి విధానాల గురించి తెలియజేశారు. పలు రాష్ట్రాల్లో అధ్యయనానికి వెళ్లిన బృందం ఒక నివేదికను ఉపసంఘానికి అందించింది. దానిపై చర్చ సాగింది. రాష్ట్రంలో రేషన్ కార్డును ఒక్క పౌర సరఫరాల వస్తువులను తీసుకోవడానికే కాకుండా పలు సంక్షేమ పథకాల్లోనూ ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయ పరిమితి నిర్ధారణ విషయంలో కొత్త రేషన్ జారీపై పలు మార్పులను చేయాలని ప్రభుత్వం చూస్తోంది. పరిమితిని తగ్గిస్తే ఎంత వరకు తగ్గించాలి, ఇప్పుడున్నట్లు కొనసాగిస్తే అర్బన్ ఏరియాల్లోనే అదే పరిమితిని ఉంచాలా లేదా, లేక తగ్గించాలా, ఆదాయం వ్యత్యాసం ఉంటుంది. ఇలా అన్ని కోణాల్లో సమావేశంలో తాజాగా చర్చించినట్లు తెలిపింది.



# సంపాదకీయం

## వైసీపీ మొన్న-నిన్న-రేపు.. జగన్ స్వయంకృతం!

2012లో ఆవిర్భవించిన యువజన, శ్రామిక, రైతు కాంగ్రెస్ పార్టీ(వైఎస్సార్ సీపీ) పరిస్థితి నానాటికీ దిగజారు తోంది. ఆది నుంచి అంతం దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. స్వయం కృషితో పార్టీని పటిష్టం చేసుకున్న జగన్..ఇప్పుడు స్వయంకృత అపరాధాలతో సర్వనాశనం చేసుకుంటున్నారన్న టాక్ వినిపిస్తోంది. 2014 ఎన్నికల సమయంలో అనేక మంది నాయకులు అనేక ఆశలతో వైసీపీ అధినేత జగన్ వెంట నడిచారు. వీరంతా సీనియర్లే. అయినా.. జగన్ ఇమేజ్, ఆయనకు ఉన్నా సానుభూతి, వైఎస్ రాజశేఖరరెడ్డి వారసత్వం వంటివి పనిచేస్తాయన్న ఉద్దేశంతోనే వారంతా ఆయనకు జైకొట్టారు. కానీ, అప్పట్లో అధికారం మిస్సయింది. ఇక, 2019 నాటికి పాదయాత్ర ద్వారా కలిసి వచ్చిన సింపతీతో జగన్ విజయం దక్కించుకున్నారు. అప్పటి కి ఎంవీ మైసూరారెడ్డి వంటి దగ్గజ నాయకులు పార్టీకి దూరమయ్యారు. అయినప్పటికీ.. పార్టీ నిలబడింది. దీనికి కారణం .. జగన్‌పై ఉన్న నమ్మకం.. ఆయనకు ఉన్న చరిష్మా. ఇదే 2019 ఎన్నికల్లో విజయం దక్కించేలా చేసింది. అయితే.. ఐదేళ్ల పాలన, అంతకు మించి పార్టీ పరంగా జగన్ వ్యవహరించిన తీరు వంటివి ఇబ్బందులు కొని తెచ్చాయి. సర్వం సహా చక్రవర్తి అన్నట్టుగా జగన్ వ్యవహరించడాన్ని సీనియర్లు జీర్ణించుకోలేక పోయారు. పైగా... నేను బటన్ నొక్కుతాను.. మీరు ప్రజల్లో ఉండండి అని జగన్ ఆదేశించడం కూడా నాయకులకు నచ్చలేదు. అయినా.. ఏమో గుర్రం ఎగరావొచ్చు! అన్నట్టుగా మళ్లీ వచ్చే అవకాశం ఉందన్న ఆశతో కొనసాగారు. కానీ, తాజా ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. దరిమిలా.. నాయకులు జారుకుంటున్నారు. ఈ జారుడు ఎందాకా? అంటే.. వైసీపీలో జగన్, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి కుటుంబ నాయకులు మిగిలే వరకు అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. సో.. వైసీపీని చూసుకుంటే.. మొన్న బాగున్న పార్టీ.. నిన్న అధికారం దక్కించుకున్న పార్టీ.. రేపు.. అనామ కంగా మారబోతున్నదన్నది రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట. ఒక పార్టీకి ఇబ్బందులు తప్పవు. వస్తాయి. కానీ, వచ్చిన సవాళ్లను ఎలా సరిచేసుకుంటున్నారన్నది కీలకం. ఈ విషయంలోనే జగన్ సంపూర్ణంగా విఫలమవుతున్నారు. తన పంథాను మార్చుకోలేక పోతున్నారు. ప్రభుత్వం పోయాక కూడా.. ఆయన దర్శనం నాయకులకు దుర్లభంగానే మారింది. ఇదే అసలు చిక్కు. కాబట్టి.. మొన్న బాగున్నా.. నిన్న అధికారం చలాయించినా.. రేపటిసంగతి చెప్పలేం! అన్నట్టుగానే మారిపోయింది. ఏదేమైనా అంతా జగన్ స్వయంకృతం!!

## వీడియో గేమ్స్ కాక క్రీడల పై దృష్టి సారిస్తే విద్యార్థులు శారీరక ధా ఆరోగ్యం తో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందుతారు... అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి పుష్ప సింతల్ కుమార్.

### అట్టహాసంగా ప్రారంభమైనపుష్ప సింతల్ కుమార్, CBSE -7 క్లస్టర్ గర్ల్స్ బాస్కెట్ బాల్ గేమ్స్.





శామీర్పేట (గరుడ వార్త) : వీడియో గేమ్స్ కాక క్రీడలపై దృష్టి సారిస్తే విద్యార్థులు శారీరిక దారుఢ్యం తో పాటు మానసిక ఉల్లాసాన్ని పొంది, విద్యలో మరింత రాణించగలుగుతారని అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి పుష్ప సింతల్ కుమార్ అన్నారు. శామీర్పేట ఎక్సలెన్షియా %CBSE%-7 బాస్కెట్ బాల్ గర్ల్స్ గేమ్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భారతదేశం తరపున అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారిని పుష్ప సింతల్ కుమార్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నార్మన్ ఇస్సాక్ హాజరైయ్యారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలో గెలుపు ఓటములు సహజం అని, క్రీడలు జీవితంలో క్రమశిక్షణ, ఒదిగి ఉండడం నేర్పుతాయి అని చెప్పారు .గెలిచామని గర్వపడకూడదు ఓడామని నిరుత్సాహపడకూడదు, ఓటమి గెలుపుకు నాంది అన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ వెంకట్ మురికి మాట్లాడుతూ తమ కళాశాలలో టోర్నమెంట్ నిర్వహించడం ఎంత సంతోషగా ఉందని అన్నారు. ఈ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల చెందిన విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు .రెండు తెలుగు రాష్ట్రాల నుండి అండర్ -14, అండర్ -17, అండర్ -19 విభాగాలలో క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎక్సలెన్సీ కళాశాలలో భారతదేశంలో ఉన్న వివిధ క్రీడలు పోటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సలెన్షియా సీఈఓ ఈశ్వరన్ , బాయ్స్ క్యాంపస్ సెంటర్ హెచ్వోడి రమేష్ ,ప్రిన్సిపల్ నీరజ కౌశిక్ , సీబీఎస్ఈ ఫౌండేషన్ అకాడమిక్ హెడ్ ఏక్ నాథ్ పాఠశాల అధ్యాపకలు తదితరులు పాల్గొన్నారుఅట్టహాసంగా ప్రారంభమైన %CBSE% -7 క్లస్టర్ గర్ల్స్ బాస్కెట్ బాల్ గేమ్స్. మేడ్చల్ జిల్లా:శామీర్ పేట్ ఎక్సలెన్షియా %CBSE-7 బాస్కెట్ బాల్ గర్ల్స్ గేమ్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భారతదేశం తరపున అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారిని పుష్ప సింతల్ కుమార్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నార్మన్ ఇస్సాక్ హాజరైయ్యారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలో గెలుపు ఓటములు సహజం అని, క్రీడలు జీవితంలో క్రమశిక్షణ, ఒదిగి ఉండడం నేర్పుతాయి అని చెప్పారు .గెలిచామని గర్వపడకూడదు ఓడామని నిరుత్సాహపడకూడదు, ఓటమి గెలుపుకు నాంది అన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ వెంకట్ మురికి మాట్లాడుతూ తమ కళాశాలలో టోర్నమెంట్ నిర్వహించడం ఎంత సంతోషగా ఉందని అన్నారు. ఈ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల చెందిన విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు.రెండు తెలుగు రాష్ట్రాల నుండి అండర్ -14, అండర్ -17, అండర్ -19 విభాగాలలో క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎక్సలెన్సీ కళాశాలలో భారతదేశంలో ఉన్న వివిధ క్రీడలు పోటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సలెన్షియా సీఈఓ ఈశ్వరన్ , బాయ్స్ క్యాంపస్ సెంటర్ హెచ్వోడి రమేష్ ,ప్రిన్సిపల్ నీరజ కౌశిక్ , సీబీఎస్ఈ ఫౌండేషన్ అకాడమిక్ హెడ్ ఏక్ నాథ్ పాఠశాల అధ్యాపకలు తదితరులు పాల్గొన్నారు

## గీతా కార్మికులకు తప్పక న్యాయం చేయాలి

### తాహాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన గీతా పనివార సంఘం పెద్దలు




మీర్ పేట, (గరుడ వార్త) : గీతా కార్మికులకు తప్పక న్యాయం చేయాలని గీతా కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి జీ సాయిలు గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మూడు చింతలపల్లి తాహాసిల్దార్ కార్యాలయం వద్ద గీత పనివాద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అద్రాస్ పల్లి లోని ప్రభుత్వ భూమిని గీతా కార్మికులకు కేటాయించాలని తహసిల్దార్ వెంకట్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిజి సాయిలు గౌడ్ మాట్లాడుతూ ఈత , తాటి వనం ఆద్రాస్ పల్లి గ్రామం లో సర్వే నంబరు 33, 173/1, 174 లోనీ ప్రభుత్వ భూమి లో, హరితహారం లో భాగంగా 3000 ఈత మొక్కలను, 25 తాటి మొక్కలకు బిందు సేద్యంతో నీటిని అందించి మొక్కలు పెంచారన్నారు. ఈ భూమిని వెంటనే సర్వే చేసి భూ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ భూమిని తక్షణమే సర్వే జరిపి సంవత్సరాలుగా గీత కార్మికుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమి జీ.వో. నంబరు 560 ప్రకారము 10 ఎకరాలు కేటాయించాలని గీతా కార్మికులకు డిమాండ్ చేశారు. 2015 సంవత్సరంలో హరితహారం క్రింద 35 మొక్కలు ప్రభుత్వం ద్వారా, ఎక్సైజ్ డిపార్ట్మెంట్, ఎమ్మార్వో రెవెన్యూ డిపార్ట్మెంట్ సంబంధిత అధికారులు వచ్చి నాటడం జరిగిందని, గీతా కార్మికులు ఎంతో కష్టపడి బోర్లు వేసుకొని, డ్రిప్ ఇరిగేషన్ తో చెట్లకు నీరు పెట్టి పెంచుతున్న తరుణంలో ప్రైవేట్ వ్యక్తులు వచ్చి కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. తక్షణమే సర్వేలు నిర్వహించి, సమస్య పరిష్కారం చేయాలన్నారు. సంబంధిత



అధికారులకు, జిల్లా కలెక్టర్ కు, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సూపరిండెంట్ కి, మెమోరండం ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గీతా పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి డి.జి.నరేందర్ ప్రసాద్, గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు లింగోల్ల హనుమాన్ దాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. యాదయ్య గౌడ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల నరసింహ, డి.హెచ్. పి.ఎస్.రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.సహదేవ్, సహాయ కార్యదర్శి ఓంకార్ మురళీధర్ రాజు, ఆద్రాస్ పల్లి సంఘం అధ్యక్షుడు రంగానగేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు గంగల వీరస్వామి, ప్రధాన కార్యదర్శి రంగా వెంకటేష్ గౌడ్, రంగా భాస్కర్ గౌడ్, కమిటీ సభ్యులు, రంగా శేఖర్, గంగల కృష్ణ, రంగా మహేష్, రంగ నరసింహ, గంగల రమేష్, ఆర్.స్రవన్. మహిళా సమాఖ్య నాయకులు, రంగాజ్యోతి, రంగ పోచమ్మ, రంగ పెంటమ్మ ,గంగల లావణ్య, రంగా పూజ, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

శామీర్ పేట, (గరుడ వార్త) : నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండబోతుందని శామీర్ పేట విద్యుత్ ఏఈ సురేందర్ శుక్రవారం తెలిపారు. బొమ్మరాసి పేట విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బొమ్మరాసిపేట్ గ్రామానికి, వ్యవసాయ పోలాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం దేవరయాంజల్ విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం1:30 గంటల నుంచి 3: 00 గంటల వరకు దేవరయంజాల్ లోని గోదాములకు, కొన్ని ప్రాంతాల వ్యవసాయ కనెక్షన్ విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శామీర్ పేట విద్యుత్ ఏఈ కోరారు.



## గుత్తేదారు నిర్లక్ష్యం... ముందుకు సాగని పనులు

ఆలేరు : మండు వేసవిలో సైతం నిండి ఆయకట్టు కింద రెండు పంటలకు (ఖరీఫ్, రబీ) సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరందిస్తూ, దిగువన మూడు చెరువులను నింపుతూ.. మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి కల్పించే శాలిగౌరారం ప్రాజెక్టు శిథిలావస్థలో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులకు గాను ప్రస్తుతం 16 అడుగులకు చేరింది. ఈ సీజన్‌కు వారం రోజుల కింద ఆయకట్టుకు సాగునీరు విడుదల చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు గత ప్రభుత్వం రూ. 5. 10 కోట్లను మంజూరు చేసి పనులు ప్రారంభించింది. సంబంధిత గుత్తేదారు చెరువు కట్ట మీద మట్టిపోసి చేతులు దులుపుకొన్నారు. ఆ మట్టి కూడా నాసిరకంగా పోయడంతో ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయి కోతకు గురైంది. పనులు పూర్తిచేయడానికి ఇచ్చిన గడువు ఏడాది క్రితమే పూర్తయింది. అయినా ఇప్పటికీ 70 శాతం పనులు చేయాల్సి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

సత్యనారాయణ, డీఈ, ఐబీ

ప్రాజెక్టు మరమ్మతులకు రూ. 5కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పినా గుత్తేదారు నిర్లక్ష్యం వీడటంలేదు. కాల్వ పనులు కూడా సక్రమంగా చేయలేదు. ఈ



విషయంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సంబంధిత గుత్తేదారుకు నోటీసులు జారీ చేశాం. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

చేయాల్సిన మరమ్మతులు..

ప్రాజెక్టు కట్టపై కంపచెట్లు తొలగించి, మట్టిపోసి కట్టను పటిష్టం చేయాలి పల్లివాడ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు గల రాచకాల్వకు మరమ్మతులు చేసి, శుభ్రం చేయాలి

రాచకాల్వపై మూడు ఎస్ఎల్ఆర్ బ్రిడ్జిలు నిర్మించి, కాల్వకు ఇరువైపులా బలహీనంగా ఉన్న కట్ట వద్ద సీసీతో రక్షణ గోడలు నిర్మించాలి.

ప్రాజెక్టు కుడి కాల్వ ఆరు కిలోమీటర్ల మేర శుభ్రం చేసి చివరి భూములకు సాగునీరందించాలి.

చేసినవికట్టపై ఉన్న కంపచెట్లను పూర్తిస్థాయిలో తొలగించలేదు. నామమాత్రంగా మట్టిపోయడంతో వర్షానికి కొట్టుకుపోయి కోతకు గురైంది.రాచకాల్వ 13 కి.మీ మేరకు మాత్రమే శుభ్రం చేశారు. కాల్వ నిండా కంపచెట్లతో అధ్వానంగా తయారైనా పూర్తిస్థాయిలో పనులు చేయకుండా వదిలేశారు.ప్రాజెక్టు కట్టపై చెట్లు తొలగించి, తూతూ మంత్రంగా పోసిన మట్టికే గుత్తేదారు రూ. 2కోట్ల వరకు బిల్లు తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

## రైతు వేదికల్లోకి ఎరువులొచ్చేనా..?

ఆలేరు : పంటల సాగులో ఆధునిక పద్ధతులను జోడిస్తూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. భిన్నమైన పంటల సాగు, భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేని పరిస్థితి. కర్షకులకు అధికారులు అందుబాటులో ఉండి మెలకువలు అందించాలనే ఉద్దేశంతో గత భారాస ప్రభుత్వం నల్గొండ ఉమ్మడి జిల్లాలో రూ. 78. 05 కోట్లు వెచ్చించి 314 రైతు వేదికలు నిర్మించింది. వీటిని ఎరువుల విక్రయ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. అంతలోనే ఎన్నికలు రావడంతో అమల్లోకి రాకుండా పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వేదికల్లోనే వ్యవసాయ శాఖాపరంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వీటితోపాటు మరిన్ని సేవలనూ అందుబాటులోకి తీసుకురావాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.

గత నిర్ణయాలు ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటల సాగుకు అవసరమైన ఎరువులను సగం మేర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), ఆగ్రోస్ కేంద్రాలు, డీసీఎంఎస్, హాకా సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నిర్ణీత ధరలకు సరఫరా చేస్తోంది. మిగతా యాభైశాతం ఎరువుల విక్రయాలు ప్రైవేటు దుకాణాల ద్వారా సాగుతున్నాయి. రైతు వేదికల్లో వసతులు ఉండటంతో ఎరువులనూ విక్రయించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏ క్లస్టర్ పరిధిలోని రైతులు అదే క్లస్టర్ రైతు వేదికల ద్వారా ఎరువులు తీసుకునేందుకు అనువుగా ఉంటుందని



భావించారు. ఇది విజయవంతమైతే విత్తనాలు కూడా విక్రయించడానికి సంసిద్ధంగా ఉన్నట్లు నాడు పాలకులు ప్రకటించారు. ఎరువుల నిల్వలు, భద్రత, రవాణా తదితర అంశాలను డీసీఎంఎస్‌లకు అప్పగించాలనుకున్నారు. ప్రభుత్వం మారిన క్రమంలో నాటి నిర్ణయాలు కార్యరూపం దాల్చలేదు. ఎరువులు, విత్తనాల విక్రయాలు, భూసార పరీక్షల జాడ లేకుండా పోయింది. కొన్ని చోట్ల రైతు వేదికలు తెరచుకోవడం లేదు. వేదికల నిర్వహణకు అందాల్సిన నిధులు సకాలంలో మంజూరు కాకపోతుండటంతో ఇవి అధికారులకు భారంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో

సాగు విస్తీర్ణం.. ఎరువుల అవసరం..

| జిల్లా | రైతులు | రైతు వేదికలు | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) | ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|---|---|---|
| నల్గొండ | 4,21,278 | 140 | 9,82,192 | 1,64,301 |
| సూర్యాపేట | 3,30,326 | 82 | 7,26,482 | 1,34,112 |
| యాదాద్రి | 1,57,206 | 92 | 6,65,000 | 80,954 |

# సర్వేకు ఎదురుచూపులు



పెద్దపల్లి : భూ కొలతలు, హద్దులు నిర్ణయించడంలో సర్వేయర్ల పాత్ర కీలకం. ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాలతోపాటు జిల్లా భూ కొలతలు, రికార్డుల శాఖలోనూ వీరు విధులు నిర్వహించాల్సి ఉంటుంది.. క్షేత్రస్థాయి అవసరాలకు తగ్గట్లు వీరి నియామకం లేకపోవడంతో సర్వేల కోసం దరఖాస్తు చేసుకుని పలువురు ఎదురు చూస్తున్నారు. నాలుగు జిల్లాల్లో 14,287 సర్వే దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది.

టీఎస్‌పీఎస్సీ ద్వారా 2018లో 150 మంది సర్వేయర్ల వరకు నియామకం చేపట్టారు. వీరిని తహసీల్దార్ కార్యాలయాలతోపాటు భూ సర్వే కార్యాలయాల్లోనూ కేటాయించారు. వీరిలో పలువురు వేరే ఉద్యోగాలకు వెళ్లిపోయారు. దీంతో భూముల సర్వేకు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకునేవారు ఉండటం లేదు. సాధారణంగా ఆస్తుల పంపకాల సమయంలో హద్దుల నిర్ణయానికి, పక్క పక్క భూముల యజమానుల మధ్య హద్దుల గొడవ తలెత్తినప్పుడు, భూ క్రయ విక్రయాల సమయంలో సర్వేకు దరఖాస్తు చేసుకుంటారు. సర్వేయర్లు రాక, సర్వే జరగక వివాదాలు అలాగే కొనసాగుతున్నాయి. దీనిపై పెద్దపల్లి జిల్లా భూమి, కొలతలు, రికార్డుల నిర్వహణ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులును సంప్రదించగా.. సర్వేయర్ల కొరత ఉండటంతో భూ సర్వేలు ఆలస్యమవుతున్నాయన్నారు. ప్రభుత్వం నియామకం చేపడితే పనులు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.

ఎప్పుడు కొలుస్తారో తెలీదు!

భూమికి సంబంధించిన సరిహద్దులు నిర్ణయించాలని ఆయా మీ సేవ కార్యాలయాల నుంచి సంబంధిత తహసీల్దార్ల వద్దకు దరఖాస్తులు వెళ్తే.. పౌరసేవల పట్టిక ప్రకారం ఏళ్లకు ఏళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఆలస్యంపై పౌరులు ఆరా తీస్తే.. సర్వేయర్లు ప్రభుత్వ పనుల్లో తీరిక లేకుండా ఉన్నారని తహసీల్దార్లు చేతులు దులుపుకొంటున్నారు. దీంతో వారు ఎప్పుడు కొలుస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. రెండేళ్ల నుంచి 14,287 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం సర్వేల కోసం వచ్చిన దరఖాస్తులను ఆయా తహసీల్దార్లు 45 రోజుల్లోగా సర్వేయర్లతో భూ కొలతలు తీసుకుని దరఖాస్తుదారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కాస్త సాఫీగా సాగడం లేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 62 తహసీల్దార్ కార్యాలయాలుంటే నిబంధనల ప్రకారం 62 మంది సర్వేయర్లు ఉండాలి. ప్రస్తుతం 45 మంది మాత్రమే ఉన్నారు.

చెరువుల సంరక్షణ కోసం జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ యంత్రాంగం కదులుతోంది. 'హైడ్రా' తరహాలో ఆయా జిల్లాల్లోని కలెక్టర్ల ఆధ్వర్యంలో చెరువుల్లోని అక్రమ కట్టడాలకు సంబంధించిన పనుల్లో సర్వేయర్లు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పలు దరఖాస్తులు పెండింగ్ లో ఉండగా.. ప్రస్తుతం చెరువుల వద్ద సర్వేలకే వీరు పూర్తి సమయం కేటాయిస్తున్నారు. దీంతో దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. చెరువుల సర్వేకు రెవెన్యూ, నీటి పారుదల, భూమి కొలతలు, రికార్డుల శాఖలతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పడగా.. సర్వేయర్లు సమగ్రంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే భూ హద్దులు కేటాయించాల్సి వస్తుంది.

పూర్వం గొలుసులతో సర్వేలు చేసేవారు. ప్రస్తుతం డిజిటల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్), లైడార్ సర్వేలు వంటి అత్యాధునిక సాంకేతిక యంత్రాలతో చేస్తున్నప్పటికీ.. ఆలస్యం జరుగుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే సర్వేయర్లు వారికి అన్ని విధాలుగా సహకరించిన దరఖాస్తుదారులకు మాత్రమే సర్వేలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## వెదురు.. పర్యావరణ కుదురు

చౌటుప్పల్: 'వెదురు'.. దీనికి 'ఆకుపచ్చ బంగారం, ప్రజల స్నేహితుడు, పేదవాడి కలప' అనే పేర్లున్నాయి. కృష్ణుడి చేతిలోని పిల్లనగ్రోవి వెదురుతో తయారు చేసిందే.. రైతు చేతిలోని ముల్లుగర్ర, పోలీసు చేతిలోని లాఠీ వెదురు కలపే.. పేదల గుడిసెలే కాదు ధనికులు ఆధునికంగా నిర్మించుకునే ఇళ్లకూ దీన్నే ఉపయోగిస్తున్నారు. వెదురు చెట్టు వర్షానికి వచ్చే వరద ప్రవాహంలో భూసారం కొట్టుకుపోకుండా కాపాడుతుంది. వాన నీరు వృథా పోకుండా భూమిలో ఇంకేలా సంరక్షిస్తుంది. పర్యావరణాన్ని రక్షణగా.. అడవుల క్షీణతను అడ్డుకుంటుంది. అడవులే ఆలంబనగా జీవించే గిరిజనులకు ఉపాధి కల్పిస్తుంది. వెదురుతో వ్యవసాయ పరికరాలు, గృహోపకరణాలు, సంగీత వాయిద్యాలు తయారు చేస్తూ ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. కశ్మీర్ మినహా దేశమంతటా 23 జాతులకు చెందిన 136 రకాల వెదురు వనాలున్నట్టు గణాంకాల్లో గుర్తించారు. ఇసుకతో కూడిన బంకమన్ను, ఎర్ర, నల్లరేగడి నేలల్లో ఇది బాగా పెరుగుతుంది. దీన్ని అటవీ చట్టాల నుంచి మినహాయించి ఉద్యాన పంటగా గుర్తించారు. ఏటా సెప్టెంబరు 18న ప్రపంచ వెదురు దినోత్సవంగా 2009 నుంచి నిర్వహిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర బాంబూ మిషన్లు రాయితీలు అందించి వెదురు సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు.



చౌటుప్పల్‌లో వనం..

చౌటుప్పల్ అటవీ క్షేత్రం పరిధి లక్కారంలోని తంగేడువనంలో ప్రత్యేకంగా వెదురు వనం విభాగం ఉంది. అడవుల్లో భూసారం కొట్టుకుపోకుండా, పర్యావరణాన్ని కాపాడేందుకు, ఉపాధికి, ఆదాయానికి వెదురు ఉపయోగకరంగా ఉంటుంది. అవగాహన కల్పించేందుకు ఈ ప్రాంతానికి అనుకూలమైన 12 రకాల వెదురు చెట్లను ఈ వనంలో పెంచుతున్నాం.

ఏ.సతీశ్‌బాబు, అటవీ క్షేత్రాధికారి, చౌటుప్పల్

సాగుకు ప్రోత్సాహం

వెదురు సాగు రైతులకు లాభదాయకం. ఒక హెక్టారు విస్తీర్ణంలో సాగుకు రూ.40వేలు ఖర్చవుతుంది. పొలం గట్లమీద హెక్టారు విస్తీర్ణంలో 130 మొక్కలు పెంచుకోవచ్చు. ఒక్కో మొక్క పెంచేందుకు రూ.240 ఖర్చవుతుంది. అందులో యాభై శాతం రాయితీని మూడేళ్ల కాలంలో బాంబూ మిషన్ మంజూరు చేస్తుంది. వెదురుతో ఎన్నో ఉపయోగాలున్నాయని అవగాహన కల్పిస్తున్నాం.

సుభాషిణి, ఉద్యానశాఖ అధికారి, యాదాద్రి భువనగిరి జిల్లా

## ఐదింట ఒక్కటే..

సుజాతనగర్ : మహిళలను ఆర్థిక శక్తిమంతులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం 'ఇందిరమ్మ మహిళా శక్తి పథకం' అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంత అతివలను పారిశ్రామిక వేత్తలుగా మార్చాలనేదే దీని ముఖ్య లక్ష్యం. ఇందులో భాగంగా 'మహిళా శక్తి' క్యాంటీన్‌లను ఏర్పాటు చేయిస్తోంది. వీటిని ఆసక్తి గల స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగిస్తోంది. అయితే జిల్లాలో దీనికి సంబంధించిన ప్రక్రియ మందకొడిగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో తొలివిడతగా 5 మహిళా శక్తి క్యాంటీన్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. వీటికి గాను స్వయం సహాయ సంఘాల సభ్యులు, స్థలాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని కొద్ది రోజుల క్రితమే ఉన్నతాధికారులు ప్రకటించారు. జన సంచారం అధికంగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు, లేదా ప్రాంతాలను ఎంపికకు చర్యలు చేపట్టారు. నిర్వాహకులకు అద్దె భారం లేకుండా చూసేందుకు ప్రభుత్వ భవనాల్లోనే క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనేది ఉన్నతాధికారుల ఉద్దేశం. ఈ క్రమంలో ఇటీవల కలెక్టరేట్‌లో తొలి 'మహిళా శక్తి క్యాంటీన్'ను ప్రారంభించారు. ఇప్పుడది విజయవంతంగా లాభాల బాటలో కొనసాగుతోంది. మణుగూరులో ఏరియా ఆసుపత్రి ప్రాంతంలో రెండో క్యాంటీన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లన్నీ సిద్ధమయ్యాయి. మిగతా వాటిని ఏర్పాటు చేసేందుకు భద్రాచలం ఐటీడీఏ, పాల్వంచ పట్టణం, జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. లక్షిత ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాల కొరతే ప్రధాన సమస్యగా మారినట్లు తెలుస్తోంది. అవసరమైతే ప్రత్యామ్నాయాన్ని చూపైనా వేగంగా ఉపాధి కల్పించాలని స్వయం సహాయక సంఘాల మహిళలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

సంఘాల సభ్యులకు పది రోజుల శిక్షణ

-విద్యాచందన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణకు ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ నెలాఖరున హైదరాబాద్‌లో హోటల్ రంగం నైపుణ్యాలపై పది రోజుల ఉచిత శిక్షణ ఏర్పాటు చేశాం. ప్రముఖ సంస్థ నిపుణులు మహిళలకు క్యాంటీన్ నిర్వహణపై తర్ఫీదు ఇస్తారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మొత్తం 5 క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఒకటి విజయవంతంగా నడుస్తోంది.

## భయపడతూ చదవాల్సిందేనా..?

కారేపల్లి : రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం ప్రమాదకరంగా తయారైంది. విద్యార్థులు, అధ్యాపకులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి దాపురించింది. 1999లో భవన నిర్మాణం పూర్తవటంతో అదే ఏడాది నుంచి తరగతులు మొదలయ్యాయి. అంతకు ముందు పక్కనే ఉన్న జడ్పీ పాఠశాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాఠశాల, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కళాశాల తరగతులు నిర్వహించేవారు.

గతమెంతో ఘనం..!ఉత్తీర్ణతలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి ఇంటర్ బోర్డు అధికారుల ప్రశంసలందుకుంది ఈ కళాశాల. ఏటా వందలాది మంది విద్యార్థులు చేరుతున్నారు. మరుగుదొడ్లు లేక ఎదురవుతున్న ఇబ్బందులపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి 2004 నవంబర్‌లో కళాశాల విద్యార్థులు ఫిర్యాదు చేశారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన న్యాయస్థానం.. 2005లో తీర్పు వెలువరించింది. అప్పట్లో సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 805 ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశించింది. ఇంతటి చరిత్ర కలిగిన కళాశాల నేడు సమస్యల వలయంలో చిక్కుకుంది. పెచ్చులూడి ఇనుప రాడ్లు తేలుతున్నాయి. వీటికి తోడు భవనం వెనుక అడుగు భాగం నుంచి నీళ్లు ఉబికి వస్తుండటంతో ప్రాంగణం, గదుల్లో బండలు కుంగిపోతున్నాయి. చెమ్మ వల్ల గోడలకు విద్యుత్తు ప్రసరణ జరుగుతుందనే విషయం తెలియటంతో కొద్దిరోజులుగా ఆ గదులకు విద్యుత్తు సరఫరా నిలిపేశారు. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కార మార్గం చూపాలని ప్రధానాచార్యులు విజయకుమారి కోరుతున్నారు.

# దోమల బెడద.. ఎన్నాళ్లీ బాధ?



సారంగాపూర్: సారంగాపూర్ మండలంలో 18 పంచాయతీలున్నాయి. ఇందులో గతంలో రెండు పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు ఉండగా ఇటీవల మరో ఆరు పంచాయతీలకు ఒక్కో పంచాయతీ రూ.65 వేలు చెల్లించి నూతనంగా కొనుగోలు చేసి అందించారు. ప్రస్తుతం ఇందులో కేవలం రెండు పనిచేస్తుండగా నాలుగు వినియోగించక ముందే మరమ్మతులు రావడంతో నిరుపయోగంగా ఉన్నాయి. రెండు రోజుల క్రితం కలెక్టర్ సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసే సమయంలో పరిసర ప్రాంతాలు పిచ్చి మొక్కలతో నిండి ఉండడంతో అసహనం వ్యక్తం చేయడంతో అప్పటికప్పుడు పరిసరాలను అధికారులు శుభ్రం చేయించాల్సి వచ్చింది. కార్యాలయాల పరిస్థితి అలా ఉంటే.. గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుంది.

జిల్లాలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. దోమల, పారిశుద్ధ్య నియంత్రణ చర్యలు కరవయ్యాయి. పంచాయతీలకు అందించిన ఫాగింగ్ యంత్రాలు సరిగా పనిచేయకపోవడంతో రోగుల సంఖ్య పెరిగి దవాఖానాలలో జ్వర బాధితులు వరుసకడుతున్నారు. వర్షం కురిస్తే కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో నీళ్లు చేరి రోజుల తరబడి నిల్వ ఉంటున్నాయి. ఫలితంగా దోమల తీవ్రత పెరిగి వ్యాధులూ విజృంభిస్తున్నాయి. వర్షాకాలం ఆరంభం నుంచే దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని పట్టించుకునే వారు కరవయ్యారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్భాటంగా ప్రకటిస్తున్నా ఆచరణలో కనిపించడంలేదు. దోమల వృద్ధి చెందకుండా శానిటేషన్‌పై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రకటించినా జిల్లాలో పూర్తి స్థాయిలో ఎక్కడా అమలు కావడంలేదన్న విమర్శలు ఉన్నాయి. వర్షాకాలంలో కచ్చితంగా ఫాగింగ్ యంత్రాలతో పిచికారి చేయాలని ఆదేశించినా ఎక్కడో చోట మినహా ఎక్కడా పనిచేయకపోవడంతో మూలన పడ్డాయి.

జ్వరాల బారిన పడుతున్నాం..

దోమల ఉద్ధృతి అధికంగా ఉండడంతో జ్వరాల బారిన పడి అనేక మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. దోమల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి. రూ.వేలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలను నిరుపయోగంగా వదిలేయడం సరికాదు. వాటికి అవసరమైన మరమ్మతులు చేపట్టి గ్రామాల్లో దోమల నియంత్రణకు ద్రావణాన్ని పిచికారీ చేసేలా చర్యలు చేపట్టాలి.

ఏలూరి రాజు, సారంగాపూర్

వాడకముందే మూలకు..

జిల్లాలో 380 పంచాయతీలున్నాయి. గతంలో కొన్ని పంచాయతీలు ఫాంగింగ్ యంత్రాలు కొనుగోలు చేయగా, ఈ ఏడాది మరిన్ని ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. గతంలో జిల్లా స్థాయి అధికారి ఒకరు జిల్లా వ్యాప్తంగా పలు పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు, దోమల నివారణకు వినియోగించే పిచికారి చేసే ద్రావణాన్ని ఒకే చోట కొనుగోలు చేసి ప్రతి మండలంలోని పెద్ద పంచాయతీలకు సరఫరా చేశారు. ఇందుకు దాదాపు రూ.కోటి వరకు వ్యయం చేసినట్లు చెబుతున్నారు. అయితే సరఫరా చేసిన యంత్రాలు వినియోగించక ముందే మరమ్మతులకు వచ్చాయి. కొన్ని ద్రావణం పోయగానే లీకేజీ అవడంతో పక్కన పడేశారు. గతంలోనూ పలు పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు పనిచేయక మూలనపడి నిరుపయోగంగా మారాయి. రూ.వేలతో కొనుగోలు చేసిన యంత్రాలకు మూలన పడేయడంతో మరమ్మతులు చేయడం లేదు. మరమ్మతులు చేయించడానికి పంచాయతీల్లో డబ్బులు లేకపోవడంతో ఉన్న యంత్రాలు మూలన ఉన్నాయని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిచేయని యంత్రాలకు తగిన మరమ్మతులు చేయిస్తామని ఎంపీవో శశికుమార్‌రెడ్డి చెప్పారు.

# నిలిచిన పురపాలిక పౌరసేవలు




సుల్తానాబాద్: సుల్తానాబాద్ పురపాలక సంఘంలో గత రెండు నెలలుగా పౌర సేవలు నిలిచిపోయాయి. దీంతో జనన, మరణ, పలు ధ్రువీకరణ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతులు లభించక పట్టణవాసులు ఇక్కట్లు పడుతున్నారు. అయిదేళ్ల క్రితం సుల్తానాబాద్ పురపాలక సంఘం ఏర్పడగా కమిషనర్‌గా రావడానికి మొదటినుంచే పలువురు విముఖత చూపుతున్నారు. పురపాలక సంఘం ఏర్పడిన తర్వాత కమిషనర్‌గా ఏ ఒక్కరూ సంవత్సర కాలం పాటు నిలకడగా పనిచేసిన దాఖలాలులేవు. కమిషనర్ జీతం ప్రభుత్వ పద్దులనుంచి కాకుండా కేవలం మున్సిపాలిటీ పద్దులనుంచే ఇవ్వడం మూలంగా ఇక్కడికి కమిషనర్‌గా రావడానికి పలువురు విముఖతగా చూపుతున్నట్లు సమాచారం. రెండు నెలల క్రితం కమిషనర్‌గా పనిచేసిన వేణుమాధవ్ కరీంనగర్‌కు బదిలీ కాగా హైదరాబాద్‌నుంచి శోభాశంకర్ వచ్చారు. ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేవలం నాలుగురోజులు మాత్రమే విధులు నిర్వర్తించి అనారోగ్య కారణాల వల్ల ధీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. ఆతర్వాత వారంరోజుల క్రితం మంథని కమిషనర్‌ను ఇక్కడకు బదిలీ చేశారనే సమాచారం ఉన్నా ఇప్పటికీ ఆయన బాధ్యతలు చేపట్టలేదు. దీంతో గత రెండు నెలలుగా కమిషనర్ తన డిజిటల్‌కీతో జారీ చేయాల్సిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతుల జారీలేక పట్టణవాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో చేయాల్సిన పలు ముఖ్యమైన అభివృద్ధి పనులకు కమిషనర్ అనుమతి ఉండాల్సి ఉండగా కమిషనర్ లేక అభివృద్ధిపనులు ముందుకు సాగడం లేదు. జనన ధ్రువీకరణపత్రాలు జారీకాక పిల్లలకు ఆధార్‌కార్డులు తీసుకునేందుకు, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ కాక పింఛను దరఖాస్తులు, బ్యాంక్ ప్రయోజనాలు, ఇళ్లు, భూమి యాజమాన్య మార్పులు చేయలేక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా అధికారులకు విన్నవించాం

సుల్తానాబాద్ పురపాలక సంఘంలో కమిషనర్ లేక పడుతున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించాం. పుర కమిషనరేట్‌కు లేఖ కూడా రాశాం. త్వరితగతిన కమిషనర్ పోస్టు భర్తీ అయ్యేలా చొరవ చూపి పట్టణవాసుల సమస్యలను పరిష్కరిస్తాం.

గాజుల లక్ష్మి, పుర చైర్‌పర్సన్

## ప్రధానార్చకుడిపై చర్యలకు రంగం సిద్ధం

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులుపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధమైంది. ఆయన ఒకేసారి రెండు వివాదాలను మూటగట్టుకున్నారు. కోడలిపై (దత్తత కొడుకు సీతారాం భార్యపై) లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే వివాదం వెలుగులోకి వచ్చింది. అతడి కోడలు తన స్వగ్రామమైన ఏపీలోని తాడేపల్లిగూడెం పోలీసులకు గత నెలలో ఫిర్యాదు చేశారు. సీతారామానుజాచార్యులు వావివరసలు మరచి అతని పోలికలతో కొడుకు కావాలని తనను వేధించేవాడని, తీవ్ర అసభ్యకరంగా ప్రవర్తించేవాడని ఫిర్యాదు పత్రంలో ప్రస్తావించారు. ఇందులో ప్రధానార్చకుడితో పాటు అతడి కుమారుడు సీతారాం కీలకమవటంతో వీరిపై ఆగస్టు 14న అక్కడ కేసు నమోదైంది.

మెమోలు జారీ..

ఈఓ రమాదేవి వీరిద్దరికీ చెరో షోకాజ్ నోటీసు, మెమో ఇచ్చి వివరణ అడిగారు. తాడేపల్లిగూడెం కేసు నమోదు సంగతి కార్యాలయానికి సమాచారమందించలేదు. దీన్ని దాచిపెట్టారు. ఈ అంశంపై తండ్రీకొడుకులకు మెమోలు ఇచ్చినట్లు తెలిపారు. ఖగోళ యాత్రలో శ్రీ భద్రాద్రి రామాలయం పేరుపెట్టుకుని భక్తుల నుంచి ప్రైవేటు నిర్వాహకులు విరాళాలు వసూలు చేశారు. ఇలా జరుగుతున్నట్లు ఆలయ అధికారులకు సమాచారం ఇవ్వలేదు. ఆ మేరకు ఖగోళ యాత్రలో పాల్గొన్న ప్రధానార్చకుడు, అర్చకుడు సీతారాంకు చెరో షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారంపై దేవాదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు



చర్యలు తీసుకునే అవకాశముంది.

మరోసారి తెరపైకి అనువంశిక దత్తత అంశం

భక్త రామదాసు ఆలయాన్ని నిర్మించి ఐదు వంశాల అర్చకులను నియమించారు. ఇందులో తూగోటి వంశం చాన్నాళ్ల నుంచి ఇక్కడ లేదు. గొట్టిపూళ్ల వంశం నుంచి ఒకరు పనిచేస్తున్నారు. పొడిచేటి, కోటి, అమరవాది వంశాలు ఇక్కడ కీలకం. ఇందులో ప్రధానార్చకుడిగా ఉన్న పొడిచేటి సీతారామానుజాచార్యులుకు కుమారులు లేకపోవడంతో కొన్నేళ్ల కిందట సీతారాం అనే యువకుణ్ని దత్తత తీసుకున్నారు. సీతారాం ఇక్కడ అర్చకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అనువంశిక విధానం అధికారికంగా లేనప్పటికీ ప్రధాన ఉత్సవాలలో ఈ వంశాలదే కీలక పాత్ర. సీతారాం దత్తతలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఆయన మిగతా అనువంశిక అర్చకుల తరహాలో ప్రధాన కోవెలలో పూజలు చేయడానికి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తాజా ఘటనలతో వంశపారంపర్య వ్యవస్థలో మేజర్ల దత్తత వర్తిస్తుందా? లేదా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

## సీసీఐపైనే ఆశలు

ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోలుకు 24 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కేంద్రాల్లో కొనుగోలు చేసే పత్తిని జిన్నింగ్ చేసేందుకు వీలుగా సంబంధిత యజమానుల నుంచి టెండర్లను కోరారు. ఈ నెల 25వరకు టెండర్లకు గడువు ఇచ్చారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే వచ్చే నెల నుంచి పత్తి క్రయవిక్రయాలు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధిక విస్తీర్ణంలో పత్తి సాగు అవుతుంది. ఈ వానాకాలం సీజన్‌లో 10.40 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. 75 లక్షల క్వింటాళ్లకుపైగా దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ఉంది. ఈ నెలాఖరు నుంచి పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలంటే ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి. ఇందులో భాగంగా సీసీఐ టెండర్లను పిలిచింది.

జిల్లాలో 24 కేంద్రాలు

జిల్లాలోని 18 మార్కెట్‌యార్డుల పరిధిలో 24 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కేంద్రాల పరిధిలో కొనుగోలు చేసిన పత్తిని సమీపంలోని జిన్నింగుల్లో బేళ్లుగా తయారు చేసి గోదాంలకు తరలించాల్సి ఉంటుంది. ఈ సీజన్‌లో గతంలో మాదిరి అవసరమైన జిన్నింగ్ కావాలని సీసీఐ టెండర్ ప్రకటన ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, బేల, బెల్లంపల్లి, బోథ్, భైంసా, చెన్నూరు, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇందారం, ఇంద్రవెల్లి, జైనూర్, కొండపల్లి, కౌటాల, కుభీరు, లక్షెట్టిపేట, నార్నూరు, నిర్మల్, నేరడిగొండ, పొచ్చెర, సోనాల, వాంకిడి, సారంగాపూర్ తదితర ప్రాంతాల్లో జిన్నింగ్‌లు కావాలని టెండర్ ప్రకటనలో పేర్కొన్నారు.

నిబంధనలు.. రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసే సీసీఐ స్థానిక



జిన్నింగ్‌లను అద్దెకు తీసుకొని బేళ్లు తయారు చేసేలా ఒప్పందం చేసుకుంటుంది. ఇందుకు జిన్నింగ్‌లో సౌకర్యాలతోపాటు కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుందని టెండరులో పేర్కొంది. గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో కొన్ని కొత్త నిబంధనలు అమలు చేస్తుండటంతో వ్యాపారులు ఒప్పుకోవడం లేదు. పత్తి నుంచి వచ్చే విత్తనాలను షెడ్‌లో ఉంచాలనేది నిబంధన. తాజాగా కొనుగోలు చేసిన పత్తికి కూడా షెడ్డు ఏర్పాటు చేయాలనే నిబంధన పెట్టారు. పత్తిని జిన్నింగ్ బయట ఉంచడంతో వర్షం వచ్చినపుడు తడిసి నష్టం జరుగుతుండటంతో సీసీఐ ఈ నిబంధన పెట్టింది. కానీ వేలక్వింటాళ్ల పత్తిని నిల్వ చేసేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలంటే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. తర్వాత జరిగిన చర్చల్లో కొన్ని నిబంధనలను సడలించారు. పత్తిని జిన్నింగ్ చేసే వ్యాపారులు క్వింటా పత్తిలో నెలవారీగా ఎంత దూది ఇవ్వాలనేది సీసీఐ నిర్ణయించింది. ప్రారంభం లో పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో క్వింటా పత్తిలో 31.15 శాతం దూది, మిగిలింది సీడ్ ఇవ్వాల్సి ఉంటుంది.

# హోదాతో మహేశ్వరానికి మహర్దశ

మహేశ్వరం : నియోజకవర్గ కేంద్రమైన మహేశ్వరాన్ని పురపాలికగా మార్చే అంశంపై పట్టన ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పురపాలికగా హోదా పెరుగుతుండడంతో దీని రూపురేఖలు, పాలన తీరుతెన్నులు ఎలా మారబోతున్నాయనేది చర్చనీయాంశమైంది. పంచాయతీల కాలపరిమితి ఫిబ్రవరి1 తో ముగిసిన నేపథ్యంలో 2024 ఫిబ్రవరి 2 నుంచి మున్సిపాలిటీగా మార్చేందుకు అభ్యంతరం లేదని 12 గ్రామపంచాయతీలకు చెందిన పలువురు ఇప్పటికే రాత పూర్వకంగా ఇచ్చారు.

కలిసేవి ఇవే..మహేశ్వరం, తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్, సిరిగిరిపురం, గంగారం, కేసీతండా, ఎన్‌డీతండా, మన్‌సాన్‌పల్లి, ఉప్పుగడ్డతండా, రాంచంద్రగూడ, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి గ్రామపంచా యతీలు కలిపి మున్సిపాలిటీగా మార్చనున్నారు.

39,693 మంది జనాభాతో..

మున్సిపాలిటీగా మార్చేందుకు 22 వేల జనాభా ఉంటే సరిపోతుంది. ప్రస్తుతం ఈ పన్నెండు పంచాయతీల్లో కలిపి 39,693 మంది జనాభా ఉంది. ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. ప్రతి విభాగానికి ఓ ఇంజనీరి



ంగ్ అధికారి, సిబ్బంది ఉంటారు. నిధులు కూడా ప్రభుత్వం నుంచి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ఏ సమస్య వచ్చినా అధికారులు అందుబాటులో ఉంటారు. ఆహ్లాదం కోసం పార్కులు, ఇతర సౌకర్యాల కల్పనకు అవకాశం ఉంటుంది.

ఆసక్తికర అంశాలు ఇవే..!

ప్రతిపాదిత గ్రామాలు అభివృద్ధిలో ముందున్నాయి. ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం ఎక్కువ. వ్యాపార, ఉద్యోగ, వ్యవసాయ వర్గాల వారు నగరంతో పోటీపడే ఖరీదైన భవనాలు నిర్మించుకున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలూ అధికమే. మహేశ్వరంలో శ్రీశివగంగ రాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రం, గడికోట, కోనేరు ఉన్నాయి.


# ఈ వారం.. సాగునీటికి తిప్పలే..!

హుజూర్‌నగర్: భారీ వర్షాలకు పడిన గండ్లు రైతులకు కడగండ్లే మిగిల్చాయి. గండ్లు పూడ్చటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఇప్పటికే 19 రోజుల నుంచి నీరు లేక నాటు వేసిన పొలాలు నెర్రెలు ఇచ్చాయి. నెల క్రితం నాటు వేసిన పొలాలు కొంత మేరకు బాగానే ఉన్నాయి. ప్రస్తుత నీటి ఎద్దడిని అవి తట్టుకునే స్థాయిలో ఉన్నాయి. కానీ ఇటీవలే నాటు వేసిన పొలాలు మాత్రం ఎండు ముఖం పట్టాయి. ఎంబీ కెనాల్ పరిధిలో... ఎంబీ కెనాల్ పరిధిలో దాదాపు 1.25 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ ఎక్కువ మంది రైతులు బోర్లు, బావులు తీసుకోవడం వల్ల ప్రస్తుతం నీరు రాకపోయినా పంటలను రక్షించుకుంటున్నారు. అవి లేకుండా కేవలం కాలువ నీటిపైనే ఆధారపడ్డ రైతుల పంటలు ఎండుముఖం పట్టాయి. త్వరితగతిన గండి పూడ్చివేత పనులు పూర్తి చేసి నీరు విడుదల చేయకపోతే రైతులు నాటు వేసిన పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఎడమ కాలువకు పడిన గండి పూడ్చి వేత పనులు జరిగే వరకు ఆగకుండా అవకాశం ఉన్న మేరకు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కేవలం కాలువ నీటిపైనే ఆధారపడి సాగు చేసిన విస్తీర్ణం దాదాపు 40వేల ఎకరాల పైచిలుకు ఉంటుందని చెబుతున్నారు. అందులో ఆలస్యంగా నాట్లు వేసిన రైతులకు దాదాపు 30వేల ఎకరాల వరకు ఉంటుందని అంచనా.

అన్నింటికీ అడ్డంకిగానే... ముందస్తుగా నాటు వేసిన వాటికి నీరు లేక కలుపు తీసే, యూరియా వేసుకునే పరిస్థితి లేదు. దీనివల్ల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఆలస్యంగా నాటు వేసిన వాటికి నీరందితేనే ఊపిరి పోసుకుంటాయి. ఇంకా నాటు వేయని వారు ఇక ఈ సీజన్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని అంటున్నారు. అధికారులు మాత్రం మరో రెండు, మూడు రోజుల్లో నీరు విడుదల చేస్తామని చెబుతున్నారు.

# ఆగ్రోస్ లక్ష్యం.. నిర్లక్ష్యం!

నల్గొండ : రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించాలనేదే తెలంగాణ ఆగ్రోస్ సంస్థ లక్ష్యం. పంటలకు అవసరమైన ఆధునిక వ్యవసాయ పరికరాలు తీసుకొచ్చి వాటి పనితీరు, ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించడానికి ఉమ్మడి జిల్లాకు సంబంధించి నల్గొండ ఆగ్రోస్ కార్యాలయంలో రూ.40 లక్షల వ్యయంతో 2017లో ప్రదర్శన కేంద్రం నిర్మించారు. సలహాల కోసం సమావేశం భవనాన్ని ఏర్పాటు చేశారు. కానీ.. ఆరేళ్లుగా దీనిని ప్రారంభించలేదు. భవనాలు నిరుపయోగంగా ఉండటంతో పరిసరాల్లో పిచ్చి మొక్కలు మొలిచాయి.



అందుబాటులోకి వస్తే..ఆగ్రోస్ పరికరాల ప్రదర్శన కేంద్రం అందుబాటులోకి వస్తే రైతులకు అవసరమైన విత్తే యంత్రం, కలుపు నివారణ పరికరాలు, కోత యంత్రాలు, అంతర్‌కృషి పరికరాలు వాటి పనితీరుతో పాటు ప్రయోజనాలు వివరించే అవకాశం ఉంటుంది. తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం పొందడంలో రైతులకు చేయూతనివ్వడానికి సరసమైన ధరలకు అందుతాయని అధికారులు అప్పట్లో వెల్లడించారు. పరికరాల పనితీరును చూపించడంతో పాటు వాటిపై అవగాహన కల్పించాల్సి ఉంది. ఆ ఉద్దేశ్యంతోనే అప్పట్లో నల్గొండలోని ఆగ్రోస్‌కు చెందిన 2.20 ఎకరాల్లో భారాస కార్యాలయంతో పాటు, పెట్రోల్ బంక్ నిర్మించారు. మిగిలిన ఎకరం స్థలంలో ఈ కేంద్రాన్ని నిర్మించారు. ప్రారంభించకుండా నిరుపయోగంగా వదిలేయవడం వల్ల రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.

ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి..

వ్యవసాయ పరికరాల కేంద్రాన్ని, సమావేశం భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే నిర్ణయం ఉన్నతాధికారులదే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. రైతుల ప్రయోజనం కోసమే దీనిని నిర్మించాం. ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తా. వెంకన్న, ఆగ్రోస్ రీజనల్ మేనేజర్, ఖమ్మం

# కోసేస్తున్నారు!



వికారాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం రకరకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులో శస్త్రచికిత్సలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇందుకు అధికారుల పర్యవేక్షణ లోపం ఒక కారణమైతే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జాప్యం చోటుచేసుకోవడం మరో కారణంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో కాన్పుల తీరుపై కథనం.

**18 నెలలుగా కిట్లు, నగదు మాటే లేదు**

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని స్త్రీ వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవిస్తే 42 వస్తువులున్న కిట్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. దీనిని మాతా, శిశు ఆరోగ్య కిట్‌గా పేరు మార్చారు. మగపిల్లవాడు పుడితే రూ.12 వేలు, ఆడపిల్ల పుడితే రూ.13 వేలు చెల్లిస్తారు. ఏడాదిన్నర క్రితం నుంచి కిట్‌తో పాటు నగదు పారితోషికాన్ని 8,000 మంది బాలింతలకు చెల్లించలేదు.

ఇవీ ప్రధాన కారణాలు

ప్రభుత్వ ఆసుపత్రుల పర్యవేక్షణ లోపం

కిట్లు, మందుల మంజూరులో జాప్యం

సిబ్బంది చేతివాటం

పారిశుద్ధ్య లోపం.. తదితరాలు..

కాన్పు చేస్తే రూ.30,000 నుంచి రూ.లక్ష వసూలు

జిల్లాలో అధికశాతం పేదలు, రైతు కుటుంబాలే ఎక్కువ. కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కింది స్థాయి సిబ్బంది ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కవుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినా..'ప్రైవేటులో తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. ఇక్కడ ఎవరూ పట్టించుకోరని' ప్రైవేటుకు వెళ్లే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు, మందులు అన్నీ ఉచితమైనా నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో అధిక శాతం గర్భిణులు తలకు మించిన ఖర్చులు భరిస్తూ తప్పనిసరై ప్రైవేటు వైపు మొగ్గుచూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొన్ని యాజమాన్యాలు సాధారణ కాన్పు అయ్యే వీలున్నా శస్త్ర చికిత్సలే మేలని నచ్చజెపుతున్నారు. కాన్పుకు రూ.30,000 నుంచి రూ.లక్ష వరకు బిల్లును చేతిలో పెడుతున్నారు.

ఆశా, ఏఎన్‌ఎంల నిరంతర పర్యవేక్షణ

– డాక్టర్ పల్వన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, వికారాబాద్.

జిల్లాలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తున్నాం. శస్త్ర చికిత్సలు మంచిది కాదని మహిళలకు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో, పట్టణాల్లో గర్భిణిగా నమోదు అయినప్పటి నుంచి ప్రసవం వరకు అన్ని తానై ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు పర్యవేక్షిస్తున్నారు. గర్భిణులను సర్కార్ దవాఖానాకు తీసుకెళతారు. వైద్యుడి వద్ద పరీక్షలు చేయిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం అయ్యే విధంగా చూస్తున్నారు.

# పురపాలికలకు మహర్దశ



తాండూరు : 'అర్బన్ తెలంగాణ..అభివృద్ధి నమూనా'లో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రాధాన్యం లభించబోతోంది. వచ్చే మార్చి కల్లా ఇందుకు సంబంధించి 'మాస్టర్ ప్లాన్–2050' తయారు కానుంది. రానున్న 26 సంవత్సరాల్లో అభివృద్ధి చెందనున్న పట్టణాలను దృష్టిలో పెట్టుకుని దీన్ని రూపొందించబోతున్నారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు ఈ ప్రక్రియలో భాగం కానున్నాయి. మున్సిపాలిటీల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పట్టణ సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగం చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు సూచించింది.

ఎన్నో ప్రయోజనాలు..

మాస్టర్ ప్లాన్–20250తో జిల్లాలోని మున్సిపాలిటీలకు భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఒన గూరతాయని అధికారులు వివరిస్తున్నారు. బ్లూ–గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు కలిపి 2024–26 సంవత్సరాల్లో రూ.13,700 కోట్లను వ్యయం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో జిల్లాలోని పురపాలికలకూ నిధులు సమకూరతాయి. దీంతో మౌలిక వసతులు మెరుగుపడతాయి.

**కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రాధాన్యం**

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోకెల్లా తాండూరు మున్సిపాలిటీ చాలా పెద్దది. పైగా వ్యాపార, వాణిజ్య కేంద్రం. నాపరాయి, సుద్ద లేటరైట్, సిమెంటు రవాణా, ఇతరత్రా ముడిసరకు రవాణాకు సంబంధించిన లారీలు నిత్యం వేలల్లో రాకపోకలు సాగిస్తుంటాయి. వీటికి తోడు ఆటోలు, కార్లు, చిన్న లారీలు, ద్విచక్ర వాహనాలు వేలల్లోనే ఉన్నాయి. వచ్చి పోయే వాహనాల కారణంగా ప్రాణవాయువు కాలుష్యకారకంగా మారుతోంది. సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.78 కోట్ల వ్యయంతో పట్టణ శివారు నుంచి 12 కిలో మీటర్ల పొడవునా రెండు వరుసలతో కూడిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి 2017లోనే శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. కొలిక్కి వస్తే లారీలు బయటి నుంచే వెళతాయి కాబట్టి కాలుష్యం తగ్గుతుంది. అయితే ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి కాబట్టి కాలుష్యం ఇంకా ఉండనే ఉంటుంది. దీన్ని కూడా పూర్తిగా తగ్గించేందుకు ప్రభుత్వం విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించ నుంది. ఇదంతా గ్రీన్ మొబిలిటీ (హరిత రవాణా) పేరుతో మిగిలిన మున్సిపాలిటీలకు కూడా వర్తింపజేస్తారు.

**కూడళ్లలో పైవంతెనల నిర్మాణం**తాండూరులోని శివాజీ, ఇందిర, అంబేడ్కర్, విలియమ్ మూన్ కూడళ్ల మీదుగా వచ్చి పోయే వాహనాల రద్దీ ఎక్కువ. వికారాబాద్‌లో ఎన్టీఆర్, బీజేఆర్, ఎంఆర్ పెంటయ్య, మహాశక్తి కూడలిలో నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. కొడంగల్‌లో అంబేడ్కర్ ప్రధాన కూడలి. పరిగిలో గంజ్, కొడంగల్ కూడళ్లు రద్దీతో ఉంటాయి. భవిష్యత్తులో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా ఇలాంటి చోట్ల పైవంతెనల నిర్మాణం చేపడతారు.

# నష్టాల ముంగిట పత్తి



కోదాడ: ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటలో పది రోజుల పాటు నీరు నిల్వ ఉంది. పత్తి చేనులో నీరు నిలిచి అధిక పదును ఉండటంతో మొక్కకు ఉన్న గూడ, పూత రాలిపోయింది. నీళ్లు నిల్వ ఉన్న చోట పత్తి మొక్క మొదలు ఎండిపోతోంది. దీంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు.

భారీ వర్షాలకు తీరని నష్టం..భారీ వర్షాలు పడటంతో పత్తి మొక్కలు ఒరిగిపోయాయి. వరదకు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో కొన్నిచోట్ల మొక్కలు చనిపోయాయి. పది రోజుల పాటు నిత్యం వర్షం పడటంతో గడ్డి విపరీతంగా పెరిగింది. దీంతో తెల్ల దోమ, పచ్చ దోమ, పురుగు ఉండటంతో చేనును రక్షించేందుకు విపరీతంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు దుక్కిమందు, యూరియా వేయడంతో పాటు పిచికారీ చేశారు. గడ్డిని తొలగించేందుకు అధిక ఖర్చు వచ్చింది. ఒక్కో ఎకరానికి అన్ని ఖర్చులు కలుపుకొని రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. విపరీతంగా గూడ, పూత రాలడంతో ఎకరానికి దిగుబడి అమాంతం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే రూ.50 వేలు పెట్టుబడి పెట్టాను

మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. దుక్కి దున్నినందుకు, విత్తనాలు, దుక్కి మందు, యూరియా చల్లడం, పిచికారీ మందులు ఇలా అన్ని ఖర్చులు కలిపి ఇప్పటికే రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తి పంట పూత, పిందె రాలిపోయింది. ఈ ఏడాది పత్తి దిగుబడి వచ్చే అవకాశం లేదు.

సైదులు, రైతు, తాడువాయి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పది రోజుల పాటు భారీ వర్షాలు పడటంతో పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. రైతులు లోతట్టు ప్రాంతాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా చర్యలు చేపట్టాలి. గూడ, పూత, పిందె దశలో అధిక పదును ఉండటంతో అవి రాలిపోతున్నాయి. రైతులు ప్లానోఫిక్స్ మందును పిచికారీ చేయాలి. సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే భారీ నష్టం వాటిల్లుతుంది.

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

# అమృతం తాగరేం..!

మునగాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలికల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అమృత్ 2.0 పథకం కింద భారీగా నిధుల కేటాయింపు జరిగింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 17 పురపాలికలకు ఈ పథకం కింద భారీగా నిధులు మంజూరు చేశారు. ఈ పథకం కింద చేపట్టే పనులకు 2023 సెప్టెంబరులోనే పరిపాలనా అనుమతులు లభించాయి. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఒకే సంస్థకు పనులు అప్పగించారు. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. టెండర్లు ఖరారై చాలా కాలం అవుతున్నా కొన్ని పురపాలికల్లో ఇంకా పనులు ప్రారంభం కాలేదు. సూర్యాపేట, నేరేడుచర్ల, చిట్యాల పురపాలికల్లో పనులు ప్రారంభించాల్సి ఉంది. పనులు ప్రారంభించిన పురపాలికల్లో నల్గొండలో మాత్రమే వేగవంతం అయ్యాయి. చాలా పురపాలికల్లో పనులు ఇంకా వేగం పుంజుకోలేదు. ఈ పనులు పూర్తి చేయడానికి రెండేళ్ల కాలపరిమితి ఉంది. పనులు ప్రారంభమైన చోట్ల చురుకుగా జరిగేలా, పనులు ప్రారంభం కాని చోట్ల వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.



ట్యాంకుల నిర్మాణానికి స్థలాల గుర్తింపు..

నేరేడుచర్ల పట్టణాన్ని మూడు జోన్లుగా గుర్తించారు. రెండు చోట్ల 300 కె.ఎల్, ఒక చోట 600 కె.ఎల్ సామర్థ్యం గల ట్యాంకులు నిర్మించనున్నారు. శివాలయం రోడ్డులో, తహసీల్దార్ కార్యాలయం వద్ద గల వెంచర్‌లో, పద్మావతినగర్‌లో గల ప్రభుత్వ స్థలాలలో వీటిని నిర్మించేందుకు ఏర్పాట్లు చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల వల్ల ఆలస్యంఅమృత్ 2.0 పథకం పనులు ఎన్నికల వల్ల ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం 14 పురపాలికల్లో ప్రారంభమయ్యాయి. మిగిలిన మూడు పురపాలికలు సూర్యాపేట, నేరేడుచర్ల, చిట్యాలలో త్వరలో ప్రారంభమవుతాయి. ఇప్పటి వరకు గుత్తేదారుకు ఎలాంటి చెల్లింపులు జరపలేదు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. హుజూర్‌నగర్, దేవరకొండ పురపాలికలకు ఇందులో నిధుల కేటాయింపు లేదు.

సత్యనారాయణ, ఈఈ, ప్రజారోగ్యశాఖ, సూర్యాపేట

# వసతులు కల్పించి.. ఆసక్తి పెంచి

పెద్దపల్లి : పాఠశాల నుంచి ఇంటికి చేరుకోగానే చాలా మంది పిల్లలు టీవీలు, స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పుస్తక పఠనంతో విజ్ఞానం వికసించేలా 'రీడింగ్, లర్నింగ్ కార్నర్' కార్యక్రమాన్ని రూపొందించారు. ఇంటివద్ద ప్రశాంత వాతావరణం కల్పించి వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

**అమలు విధానం ఇదీ**

పిల్లల్లో పఠనాసక్తి, వ్యక్తిత్వ వికాసం మెరుగుపరిచేందుకు నీతి, బొమ్మల కథల పుస్తకాలు అందజేస్తున్నారు.

వారంలో రెండు రోజులకోసారి పుస్తకాలు ఇంటికి తీసుకెళ్తున్నారు. హోంవర్క్‌తో పాటు ఈ పుస్తకాలను పఠించేలా ఆసక్తి కలిగిస్తున్నారు. ఇంటికి చేరుకోగానే పుస్తక పఠనం చేసేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నారు.

కొందరు ఉపాధ్యాయులు పాఠశాలల్లో పిల్లల విజ్ఞానాన్ని పరీక్షిస్తున్నారు. వికసిస్తున్న విజ్ఞానంరీడింగ్, లర్నింగ్ కార్నర్ కార్యక్రమంతో చిన్నారుల్లో విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతోంది. నీతికథలు, బొమ్మలకథల పుస్తకాలకు ఆకర్షితులవుతున్నారు. చదువుకోవడం, రాసుకునేందుకు అనువుగా ఉండేలా వాతావరణాన్ని కల్పిస్తున్నారు. పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉండటంతో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి. వీటితో పాటు ఉపాధ్యాయులు ఇచ్చిన ఇంటి పని(హోంవర్క్)ని పూర్తి చేస్తున్నారు.

**ఏకాగ్రతతో చదువుతున్నా**

నేను బిట్టుపల్లి నుంచి పాఠశాలకు వస్తున్నా. ఇంటి వద్ద నా కోసం వసతులు కల్పించారు. బొమ్మలు, నీతి కథల పుస్తకాలను ఇంటికి తీసుకెళ్తున్నా. హోంవర్క్ పూర్తి చేసిన వెంటనే నీతికథలు చదువుతున్నా. ఉపాధ్యాయులు నిత్యం ఎన్నో విషయాలను చెబుతున్నారు.

హర్షవర్ధన్, 4వ తరగతి, ఎక్లాస్‌పూర్ ప్రాథమిక పాఠశాల

**ఎంతో ఆసక్తిగా ఉంది**

మా ఇంటి వద్ద చదువుకునేందుకు తల్లిదండ్రులు మంచి వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం ఇంటికి వెళ్లగానే ముందుగా రోజువారి పనులను పూర్తి చేసుకుంటున్నా. నీతికథలు, బొమ్మలు, ఇతర పుస్తకాలను చదువుతున్నా. నిత్యం పుస్తకాలను చదువుతుండటంతో ఆసక్తి పెరుగుతోంది.

రూపాదేవి, 7వ తరగతి, కాచాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల, జూలపల్లిపకడ్బందీగా అమలు చేస్తున్నాం

జిల్లాలో రీడింగ్, లర్నింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఇందుకోసం పాఠశాలలకు కథలు, బొమ్మలు, నీతి పుస్తకాలు పంపిణీ చేశాం. పిల్లలు ఇంటి వద్దకు తీసుకెళ్లి చదువుతూ పఠనాసక్తిని పెంచుకుంటున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలి. వారికి అనువైన వాతావరణాన్ని కల్పించాలి.

పీఎం షేక్, సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త

# యంత్రాల వినియోగం ఎంత?

సారంగాపూర్: ఇటీవల వర్షాలతోపాటు జిల్లాలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. దోమల నియంత్రణతోపాటు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించేందుకు పంచాయతీలకు అందించిన పరికరాలు నిరుపయో గంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.50 లక్షలు వ్యయం చేసి పిచికారీ యంత్రాలతోపాటు చేసే దోమల నివారణ మందులను పంచాయతీలకు అందించారు. ప్రస్తుతం గ్రామాల్లో దోమల తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఫాగింగ్ చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

**తాగునీటి నాణ్యత పరీక్ష కిట్లు ఎక్కడ?**

మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ నీటి సరఫరా లేకపోవడంతో స్థానికంగా బోర్లు, బావుల ద్వారానే నీటిని అందిస్తున్నారు. తరచూ గేట్‌వాల్వులు, పైపులైన్ల లీకేజీలతో పాటు మంచినీటి ట్యాంకులలో అపరిశుభ్రతతో నీరు కలుషితమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో నీటి నాణ్యతను పరీక్షించేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా క్లోరో స్కోప్(తాగు నీటి నాణ్యత)కిట్లను పంచాయతీలకు



అందించారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పంచాయతీలు పరీక్షలు నిర్వహించడం లేదు. అంతేకాకుండా కనీసం రక్షిత మంచినీటి బావులు, ట్యాంకులు, ఇళ్లలోని బావులలోనూ క్లోరినేషన్ చేయడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**వివరాల నమోదులో నిర్లక్ష్యం**

రక్షిత మంచినీటి ట్యాంకులు, బోరుబావులు, చేతి పంపులు తదితర తాగునీటి వనరుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా కనిపించడంలేదు. నీటి వనరుల పరీక్ష నివేదిక ఆధారంగా నీరు తాగేందుకు పని కొస్తుందా..? లేదా అన్న విషయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. నాణ్యతలో వ్యత్యాసం ఉంటే ఆ ప్రాంతంలో ప్రత్యామ్నాయ వనరులతో తాగునీటిని అందించాల్సి ఉంటుంది. ఒక్కో నీటి వనరు వద్ద మూడు చోట్ల పరీక్షలు చేయడమే కాకుండా గ్రామంలోని రక్షిత మంచినీటి పథకాన్ని నెలలో మూడు సార్లు శుభ్రం చేయించాలి. వీటన్నింటిని పాటించినప్పుడే ప్రజలకు శుద్ధ జలం అందే అవకాశముంది. గతంలోనూ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో పంచాయతీలకు నీటి నాణ్యత కిట్లను అందజేశారు. చాలా చోట్ల పరీక్షలు చేయకుండానే మూలన పడేశారు.

# సర్కారు బడులకు జీరో విద్యుత్తు బిల్లు

కరీంనగర్ : గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలల సమస్యల్లో విద్యుత్తు బిల్లులు ఒకటి. రాష్ట్ర ప్రభుత్వం ఏటా తీసుకొస్తున్న సంస్కరణలు, బోధన సౌకర్యాలతో విద్యుత్తు వాడకం పెరుగుతుంది. పాఠశాలల నిర్వహణ నిధులు సరిపోక బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మెజారిటీ పాఠశాలలు వేల రూపాయల బిల్లులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సీఎం ప్రకటనతో ఉమ్మడి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**రూ. వేలల్లో బకాయిలు** మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కార్యక్రమాల ద్వారా ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడుల్లో ఫ్యాన్లు, లైట్లు, బోర్‌పంపులు, శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇంతకుముందే డిజిటల్ విద్యలో భాగంగా ప్రొజెక్టర్లు, కంప్యూటర్లు పాఠశాలల్లో ఉన్నాయి. మరో వైపు అధికారులు పాఠశాలలకు కేటగిరీ–7ఏ కింద విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. పాఠశాలల్లో సెలవుల్లో మినహా కరెంటు వాడకం తప్పనిసరి కావడంతో బిల్లులు పెరుగుతున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు.. ఉన్నత పాఠశాలల్లో గదులు, డిజిటల్ తెరలు, విద్యార్థులు ఎక్కువ ఉండటంతో రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు.. కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల నిర్వహణ నిధులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారు.



**నిర్వహణకు సరిపోని నిధులు..**

సర్కారు పాఠశాలలకు ప్రభుత్వం ఏటా విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు నిర్వహణ నిధులు అందిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రూ.50 వేల నిధులిచ్చే పాఠశాలలు తక్కువగా ఉండగా.. రూ.10 వేలు, రూ.25 వేలు వచ్చేవి అధికంగా ఉన్నాయి. ఈ నిధులు జాతీయ పండుగలు, కంప్యూటర్లు, ల్యాబ్‌ల నిర్వహణ, స్టేషనరీ, విద్యుతు బిల్లులు, చిన్నచిన్న మరమ్మతులు, నెట్ ఛార్జీలు, తాగునీరు తదితర సదుపాయాలకు సరిపోవడంలేదని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యుత్తు బిల్లులు చెల్లిస్తే మిగిలిన వాటికి ఒక్క పైసా కూడా మిగలడం లేదని వాపోతున్నారు. దీంతో పెద్దమొత్తం విద్యుత్తు బిల్లులు బకాయిలుగా పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత తప్పనుంది.

**సంతోషకర విషయం**సర్కారు బడులకు ఉచిత విద్యుత్తు అందిస్తామని సీఎం నిర్ణయం ఉపాధ్యాయుల్లో సంతోషాన్ని నింపింది. ఎన్నో ఏళ్లుగా ప్రధానోపా ధ్యాయులు ఇదే విషయాన్ని ప్రభుత్వాల ముందుంచుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో బిల్లుల సమస్య తీరడంతోపాటు పాఠశాలల నిధులను ఇతర అవసరాలకు వాడుకునే వీలుంది.– కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం

# పర్యావరణహితానికి ఈపీఆర్



హైదరాబాద్ : ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రవేశపెట్టిన 'ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్)' సత్ఫలితాలనిస్తోంది. ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేసే, వాటిని ప్రాసెస్ చేసే సంస్థలకు 100శాతం రీసైక్లింగ్ బాధ్యతను అప్పగించడంతో కాలుష్యానికి అడ్డుకట్టపడుతోంది. ప్రతి సంస్థ సీపీసీబీ రూపొందించిన ఈపీఆర్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని మార్గదర్శకాలు విడుదల చేయగా ఇప్పటి వరకు రాజధాని పరిధిలోని 300 సంస్థలు ఇందులో చేరాయి. ప్లాస్టిక్ తయారీ సంస్థలతో పాటు ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెసర్స్ (సీడబ్ల్యూపీ) యూనిట్లు ఉన్నాయి. భూమిలో త్వరగా కరిగిపోయే (బయోడీగ్రెడబుల్) కంపోస్టబుల్ ప్లాస్టిక్ యూనిట్లు సైతం ఈపీఆర్‌లో రిజిస్టర్ అవ్వాలని సూచించడంతో పదుల సంఖ్యలో సంస్థలు రిజిస్టర్ అయ్యాయి.

ఇవీ నిబంధనలు... ఉత్పత్తిదారుల వస్తువుల వల్ల మార్కెట్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించే బాధ్యతను అవే సంస్థలకు ఈపీఆర్ ఆథరైజేషన్ ద్వారా సీపీసీబీ అప్పగించింది. ఇలా ఏటా ఉత్పత్తయ్యే ప్లాస్టిక్‌ను వారే సేకరించి రీసైక్లింగ్ కేంద్రాలకు పంపాలని ఉత్పత్తి ఆధారంగా లక్ష్యాలను నిర్దేశిస్తోంది. ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లు కూడా సేకరించిన వ్యర్థాలకు సంబంధించి 'ఈపీఆర్ సర్టిఫికేట్'ను జారీ చేస్తారు. ఉత్పత్తిదారులు ఈ వివరాలన్నింటినీ ఈపీఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. రీసైక్లింగ్ యూనిట్ల నిర్వాహకులు సైతం రీసైక్లింగ్ ప్లాస్టిక్‌ను బయట విక్రయించినా సంబంధిత జీఎస్టీ ఇన్‌వాయిస్‌లు, వేబ్రిడ్జి స్లిప్‌లను అప్‌లోడ్ చేయాలి. లక్ష్యం చేరుకోకపోతే తర్వాతి ఏడాది పూర్తి చేయాలి. ఉదా: ఓ సంస్థ 100 టన్నుల వ్యర్థాలకు బదులు 75 టన్నులు రీసైక్లింగ్ కేంద్రాలకు పంపితే తర్వాతి ఏడాదిలో వచ్చే లక్ష్యానికి అదనంగా 25 టన్నులు పూర్తి చేయాల్సి ఉంటుంది. రీసైక్లింగ్ సంస్థలు సైతం డూప్లికేట్ రశీదులు, జీఎస్టీ బిల్లులు సమర్పిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. గతంలో మహారాష్ట్రలో ఓ రీసైక్లింగ్ కేంద్ర నిర్వాహకుడు నకిలీ బిల్లులు సమర్పిస్తే గుర్తించిన సీపీసీబీ రూ.50కోట్ల వరకు జరిమానా విధించింది.

ఆడిట్ తప్పనిసరి...ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రక్రియ మొత్తానికి ప్రతి ఆరు నెలలకోసారి ఆడిట్ నిర్వహించి పొరపాట్లు చేసినవారిపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆడిట్‌లో భాగంగా ఉత్పత్తి, రీసైక్లింగ్ సామర్థ్యంపై భౌతికంగా అధికారులు పరిశీలిస్తారు. ఎన్ని టన్నులు రీసైక్లింగ్ చేయొచ్చని క్యాపింగ్ ఇస్తారు. అప్పుడే రీసైక్లింగ్ కేంద్రాలు సర్టిఫికేట్ జారీ చేసే అర్హతను నిర్ణయించి అనుమతి జారీ చేస్తారు.

# అందుతున్న రుణం.. మహిళల అభివృద్ధి పథం



తాండూరు : ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా రూ.వందల కోట్ల రుణాల్ని మంజూరు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేస్తూ ఆసక్తి ఉన్న రంగంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీర్ఘకాలంలో ప్రయోజనాలు పొందుతున్నారు. ఆర్థిక స్థిరత్వం సాధిస్తు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**రెండు నెలల్లోనే 23 శాతం మేర పంపిణీ**

జిల్లాలోని 20 మండలాల పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు మహిళా సమాఖ్య ద్వారా, నాలుగు పట్టణాల పరిధిలో మెప్మా ద్వారా రుణాలు అందజేస్తున్నారు. ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం నిర్దేశించుకుని రుణాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు నెలల్లోనే 23 శాతం రుణాల పంపిణీ లక్ష్యం పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంత మహిళలున్న 13,138 సంఘాలకు రూ.554.49కోట్లు రుణాలు అందించేందుకు ఖరారు చేశారు. ఎంపీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో జూన్, జులై మాసాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు రుణాల పంపిణీపై దృష్టిసారించారు. 1,334 సంఘాల్లోని మహిళలకు రూ.127.83కోట్లు రుణాలు పంపిణీ చేశారు. సంఘాల్లోని 13వేలకుపైగా మహిళలకు ఆర్థిక ప్రయోజనం చేకూరింది.

**కూతురిని డాక్టర్ చదివిస్తున్నా..**

తొలుత కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేందుకు ఇబ్బందులు పడ్డా. 2007లో డ్వాక్రా సంఘంలో నెలనెలా పొదుపు చేయడంతో బ్యాంకు అధికారులు రుణం మంజూరు చేశారు. దాంతో కిరాణ దుకాణం ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నా. వచ్చిన ఆదాయంతో కూతురును చదివించా. ఎంబీబీఎస్ సీటు రావడంతో ఆగ్రాలో వైద్య విద్యనభ్యసిస్తోంది.

జగదేవీ, డ్వాక్రా మహిళ, ఓగీపూర్.

**పంచాయతీ కార్యదర్శిని చేశా..**

డ్వాక్రా సంఘంలో 2005లో చేరా. బుక్‌కీపర్, అధ్యక్షురాలిగా కొనసాగుతున్నా. సంఘం ద్వారా మంజూరైన రుణం పెట్టుబడిగా పెట్టి వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నా. వచ్చిన ఆదాయంతో కూతురు సంధ్యను చదివించా. తొలిప్రయత్నంలోనే పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వ కొలువులో చేరింది.రాధమ్మ, డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు, బెల్కటూరు.

**అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తున్నాం..**

స్వయం సహాయక సంఘాల మహిళల ఆసక్తిని గుర్తించి రుణాలు విరివిగా అందించి ప్రోత్సహిస్తున్నాం. రుణాలతో ఏర్పాటు చేసే యూనిట్లను విజయవంతంగా నిర్వహించేందుకు సీసీలు, ఏపీఎంలతో పర్యవేక్షణ చేయిస్తున్నాం. గ్రామాల వారిగా సమీక్ష సమావేశాలు నిర్వహించి లక్ష్యంమేర రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నర్సింహులు, డీపీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ.

# అమ్మో డేటింగ్ యాప్స్.. ఆకర్షణ వలలో చిక్కి యువత విలవిల

హైదరాబాద్: అందమైన రూపం.. ఆకర్షించే సంపాదన. ఒక్క క్లిక్‌తో ఆనందాన్ని ఆస్వాదించవచ్చంటూ కనికట్టు. నచ్చిన జోడును ఎంపిక చేసుకోవచ్చంటూ ఊరింపు. ఒక్కసారి చిక్కారా.. జేబులైనా ఖాళీ కావాలి.. ఒళ్లయినా హూనం చేసుకోవాలి. ఎంతోమంది డేటింగ్‌యాప్ మోసాల్లో బాధితులుగా మారుతున్నారు. గౌరవమైన వృత్తిలో ఉంటూ మాయాజాలానికి చిక్కినట్టు తెలిస్తే పరువు పోతుందనే భయంతో 90శాతం మంది ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావట్లేదంటున్నారు పోలీసులు.ఐటీ ఉద్యోగిని జీవితభాగస్వామి కోసం డేటింగ్‌యాప్‌లో వెతికింది. యువకుడి ప్రొఫైల్ నచ్చి ఒకే చెప్పింది. యూకేలో వైద్యుడినంటూ పరిచయం చేసుకొని వ్యక్తిగత అవసరాలంటూ రూ.15లక్షలు కొట్టేసి ముఖం చాటేశాడు.యాప్‌లో పరిచయమైన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ముహూర్తం కోసం ఎదురుచూస్తుండగా అప్పటికే పెళ్లయినట్టు తెలిసిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆస్ట్రేలియాలో ఉంటున్న యువకుడికి రాయచూర్‌లోని యువతి సామాజిక మాధ్యమం ద్వారా పరిచయమైంది. యువతిని హైదరాబాద్ రప్పించి, శీతలపానీయంలో మత్తు మందు కలిపి అఘాయిత్యానికి ఒడిగట్టాడు.గతంలో నైజీరియన్లు మాత్రమే పాల్పడే మోసాల్లో ప్రస్తుతం తెలుగు కుర్రాళ్లు కూడా ప్రారంభించారని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కీలుబొమ్మలతో వలపు ఎర

వ్యభిచార ముఠాల వారు దేశ, విదేశీ యువతులకు కమీషన్ ఆశచూపి డేటింగ్‌యాప్‌ల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఆయా యాప్‌ల్లో నమోదైన వారిలో సంపన్నులతో ఛాటింగ్ చేస్తారు. ఏకాంతంగా గడిపేందుకు హైదరాబాద్‌లో



హొటల్‌గది బుక్ చేయిస్తారు. సెల్‌ఫోన్‌తో వీరి రాసలీలలు చిత్రీకరించి.. బెదిరించి రూ.లక్షల్లో గుంజుతారు. ఇటీవల ప్రధానపార్టీకి చెందిన చోటా నేత రూ.3లక్షలు పోగొట్టుకున్నాడు. జూబ్లీహిల్స్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో విదేశీ యువతులు అద్దెకు దిగారు. యాప్ ద్వారా పరిచయమైన పురుషులను ఆహ్వానించేవారు. అపార్ట్‌మెంట్ కిందభాగంలో ఉన్న ఏజెంట్లు వారిని బెదిరించి నగదు లాక్కునేవారు. పోలీసుల దృష్టికి వెళ్లటంతో ముఠా ఆటకట్టించారు.

# అరుదైన నైపుణ్యం.. ఆధునికీకరిస్తే మేలు

సిరిసిల్ల: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉంటారు. వీరి చేనేత కళలకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. కాలక్రమంలో చేనేత స్థానంలో మరమగ్గాలు వచ్చాయి. ఆధునికతను అందిపుచ్చుకుంటూ.. ఉత్పత్తులకు వన్నెలద్దిన నేతన్నలు తమ కంటూ ప్రత్యేకత చాటుకున్నారు. అయితే ఏడేళ్లుగా ఒకే రకమైన ఉత్పత్తులను చేయడంతో నేతన్నలకు ఆదాయం రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లను సమతూకం చేసుకుంటేనే చేనేత పరిశ్రమకు మనుగడ.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

**ఉమ్మడి జిల్లాలో 36 వేల మరమగ్గాలు**

రాష్ట్ర వ్యాప్తంగా 48 వేల మరమగ్గాలుంటే.. ఉమ్మడి జిల్లాలోనే 36 వేలు ఉన్నాయి. సిరిసిల్లలో 1970లో వేళ్లూనుకున్న మరమగ్గాల పరిశ్రమ రెండో షోలాపూర్‌గా ప్రసిద్ధి చెందింది. గత భారాస ప్రభుత్వం ఇక్కడే అత్యాధునిక పరిశ్రమల కేంద్రమైన టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో 31 చేనేత పారిశ్రామిక సహకార సంఘాల్లో 1524 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మరమగ్గాల్లో ఎనిమిది వేల మంది నేతన్నలు ఉపాధి పొందుతున్నారు. చేనేత వృత్తి ఆనవాళ్ల కోసం పాతతరం వారు మగ్గాలపైనే వస్త్రాలు నేస్తున్నారు. ముతక రకం తెల్లవస్త్రం నుంచి పట్టు చీరలను పోలిన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ప్రభుత్వం ఆధునికీకరణకు రాయితీలు కల్పించడంతో పురాతన మరమగ్గాలకు డాబీ, జకాట్, ఎలక్ట్రానిక్ పరికరాలను అమర్చుకున్నారు. కానీ ఆర్డర్లు లేక వీటి వినియోగం తగ్గింది. గత



భారాస ప్రభుత్వం చేనేత కార్మికులకు బతుకమ్మ చీరల తయారీ బాధ్యతలు అప్పగించడంతో వారికి చేతి నిండా పని ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరలను నిలిపివేసి పాఠశాలల ఏకరూప దుస్తులను కుట్టే బాధ్యతలు అప్పగించడంతో వారికి ఉపాధి తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం మొన్నటి బడ్జెట్‌లో చేనేత, జౌళి రంగానికి రూ.370 కోట్లు కేటాయించి ప్రభుత్వ సంస్థలకు అవసరమైన వివిధ వస్త్రాలను టెస్కో ద్వారా స్థానిక నేతన్నల నుంచే సేకరించాలని నిర్ణయించింది. ఇటీవల కేంద్రం రాష్ట్రంలో ఐఐహెచ్‌టీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ) ఏర్పాటు చేయడానికి అంగీకరించించడం శుభపరిణామంగా చెపొచ్చు.

**అద్భుత కళలకు నిలయం**

చేనేత మగ్గంపై అనేక అద్భుతాలు సృష్టించిన ఘనత సిరిసిల్లా జిల్లా నేతన్నల సొంతం. ఈ వారసత్వాన్ని నేటి తరం కొనసాగిస్తున్నారు. పట్టు, సిల్కు నూలుతో తయారుచేసిన వస్త్రాలు, అగ్గిపెట్టెలో పట్టే చీర.. ఉంగరం, దబ్బణంలో దూరే వస్త్రాలు నేసి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. గతేడాది చేనేత మగ్గంపై జీ–20 లోగోను తయారుచేసిన సిరిసిల్లకు చెందిన హరిప్రసాద్ ప్రధాని మోదీ దృష్టిని ఆకర్షించాడు. అయితే ప్రభుత్వాలు నేతన్నల సంక్షేమం మీద దృష్టిపెట్టి వారికి ఆర్డర్లు అప్పగించి పని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేతన్నల ప్రధాన డిమాండ్‌లు

మరమగ్గాల ఆధునికీకరణకు రాయితీలు

ఈ రంగంలో స్థిరపడాలనుకునే కొత్తతరం వారికి ప్రోత్సాహకాలు

ఉమ్మడి జిల్లాలో వస్త్రోత్పత్తులకు సీఎఫ్‌సీ (ఉమ్మడి వసతుల కేంద్రం)

యజమానులు, ఆసాములు తమ ఉత్పత్తులను స్వతంత్రంగా విక్రయించుకునేలా నేత బజారు ప్రభుత్వ వస్త్రోత్పత్తుల ఆర్డర్లు ఏటా 15 కోట్ల మీటర్ల అందించాలి నూలు డిపో ఏర్పాటు చేసి ప్రభుత్వమే నూలు..

పెట్టుబడి కింద మ్యాక్స్ సంఘాల సభ్యులకు రూ.10 లక్షల సాయం అందించాలి.మరమగ్గాల కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరిచేలా టెస్కో ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించాలి

# లింకు రోడ్లకు సై.. శివారులో రయ్ రయ్

హైదరాబాద్: ప్రధాన నగరంలో ఏళ్లుగా ఎదురు చూస్తోన్న బేగంపేట లింకు రోడ్లకు మోక్షం లభించింది. భూసేకరణ, ఇతర సవాళ్లను దాటుకుని నెక్లెస్‌రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి బేగంపేట రైల్వేస్టేషన్ వరకు రైలు మార్గం పొడవునా లింకు రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. బేగంపేట ప్రకాశ్‌నగర్ నుంచి మూసీ నది పక్కనున్న బ్రాహ్మణవాడిని కలుపుతూ మరో లింకు రోడ్డు నిర్మాణం కాబోతుంది. నెక్లెస్ రోడ్డు జలవిహార్ నుంచి రైల్వే లైను మీదుగా బేగంపేటను కలిపే ఆర్వోబీ ప్రతిపాదన పరిశీలనలో ఉంది. దీనికి సైతం ఆమోదం లభిస్తుందని బల్దియా ఆశాభావం వ్యక్తం చేస్తోంది. వీటితోపాటు శివారులోని పలు ప్రాంతాల్లో కలిపి 49 లింకు రోడ్లకు ప్యాకేజీ 1, 2 లలో భాగంగా హైదరాబాద్ రహదారుల అభివృద్ధి సంస్థ(హెచ్‌ఆర్‌డీసీఎల్) టెండర్లు పిలిచింది. ప్యాకేజీ–1లోని 24 రోడ్లను రూ.486 కోట్లతో, ప్యాకేజీ–2లోని 25 రోడ్లను రూ.571.4 కోట్ల నిధులతో 100 అడుగుల వెడల్పున నిర్మించనున్నారు. రెండేళ్లలో పనులు పూర్తవుతాయని ఇంజినీర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# దడ పుట్టిస్తున్న భూస్థాయి ఓజోన్

హైదరాబాద్: వాహనాలు, పరిశ్రమల వల్ల వెలువడే భూస్థాయి ఓజోన్ (గ్రౌండ్ లెవెల్ ఓజోన్) పరిమాణం ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తోంది. ఐదేళ్లలో నమోదైన వివరాలతో పోల్చితే ఈ ఏడాది మరింతగా



పెరిగిందని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) తాజా అధ్యయనంలో వెల్లడించింది. జనవరి నుంచి జూన్ మధ్య నిత్యం ఒక ప్రాంతంలో భూస్థాయి ఓజోన్ పరిమాణం పెరిగిందని వెల్లడించింది. అయితే గతంతో పోల్చితే గ్రేటర్‌లో భూస్థాయి ఓజోన్ పరిమాణం పెరిగిందని తెలిపింది. సాధారణంగా ఓజోన్ పొర భూమికి 15–30 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడి అతి నీల లోహిత కిరణాల నుంచి భూమిని కాపాడుతుంది. అయితే వాహనాల నుంచి వెలువడే భూస్థాయి ఓజోన్ భూఆవరణలోనే ఉంటుంది. ఇది మానవాళికి హానికరం. గ్రేటర్ హైదరాబాద్‌లో యావరేజ్ డ్యూరేషన్ ఆఫ్ ఎక్సీడెన్స్ (వ్యాప్తి సమయం) గతేడాది 11.7 గంటలు ఉండగా ఈ ఏడాది 12.7 గంటలకు పెరిగిందని వెల్లడించింది.



# శ్రీవారి ఫొటోలను తొలగించేందుకు జగన్ అండ్ కో యత్నం..!

తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూలో కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వివాదం వేళ కార్మిక శాఖ సహాయ మంత్రి శోభాకరంద్లాజే ఈ అంశంపై తీవ్రంగా స్పందించారు. "తిరుమలకు చెందిన కళాశాలల్లో పద్మావతీ శ్రీనివాసుల ఫొటోలను తొలగించాలని, హిందూయేతర గుర్తులను సప్తగిరులపై ఏర్పాటు చేయాలని జగన్ అండ్ కో చూసింది. హిందువులు కానివారిని బోర్డ్ ఛైర్మన్‌గా నియమించింది. జంతువుల కొవ్వులను పవిత్ర ప్రసాదంలో కలిపింది. వెంకటేశ్వరస్వామీ.. మా చుట్టూ జరుగుతున్న ఈ హిందూ వ్యతిరేక రాజకీయాలకు మమ్మల్ని క్షమించు" అని ఘాటుగా ఎక్స్‌లో పోస్టు చేశారు. లడ్డూలో కల్తీ ఆరోపణలపై దర్యాప్తు అవసరమని కేంద్ర ఆహారశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన అంశం చాలా తీవ్రమైంది. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి.. దోషులుగా తేలిన వారిని శిక్షించాలి" అని ఆయన ఓ ఆంగ్ల వార్తా సంస్థ వద్ద వ్యాఖ్యానించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూల తయారీకి సరఫరా చేసిన నెయ్యిలో ఫిష్ ఆయిల్ (చేపనూనె)తోపాటు గొడ్డు, పందికొవ్వు నుంచి తీసిన నూనెలు కలిపినట్లు తేలిందని తెదేపా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి గురువారం చెప్పారు. గుజరాత్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత ల్యాబొరేటరీ ఎన్‌డీడీబీ కాఫ్ ల్యాబ్ నుంచి వచ్చిన ఫలితాలే ఇందుకు నిదర్శనమని ఆరోపించారు. 'ఇది కోట్లాది శ్రీవారి భక్తుల మనోభావాల్ని దెబ్బతీయడం కాదా? గోవిందుడితో పెట్టుకున్నవారు సర్వనాశనమైపోతారు' అని ధ్వజమెత్తారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో లడ్డూ ప్రసాదంలో నాణ్యత లేని నెయ్యి వాడారనేది వాస్తవమేనని.. తిరుపతిలో తితిదే మాజీ పాలకమండలి సభ్యుడు ఓవీ రమణ బాంబు పేల్చారు. నెయ్యి టెండర్ అప్పజెప్పిన ఆల్ఫా సంస్థ రకరకాల కెమికల్స్ ద్వారా తయారుచేసిన నెయ్యిని సరఫరా చేసిందని తెలిపారు. ఈ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తీవ్రంగా స్పందించారు. వైకాపా హయాంలో తిరుమల లడ్డూలో అపవిత్రమైన కల్తీ నెయ్యి వాడి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని మండిపడ్డారు. దీనికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు.



# ల్యాబ్ పరీక్షల్లో నెయ్యి నాణ్యత లేదని తేలింది

తిరుమల: తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూలో కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోన్న వేళ తితిదే ఈవో శ్యామలరావు స్పందించారు. "శ్రీవారి లడ్డూ నాణ్యతపై కొంతకాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. నాణ్యతపై పోటు సిబ్బందితో మాట్లాడాను. వారు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. లడ్డూ నాణ్యతగా ఉండాలంటే.. నెయ్యి నాణ్యంగా ఉండాలని చెప్పారు.

నెయ్యి నాసిరకంగా ఉందని గుత్తేదారుకు చెప్పాం. నెయ్యిలో నాణ్యతా లోపాన్ని నేను కూడా గమనించాను. నెయ్యి నాణ్యత నిర్ధరణకు తితిదేకు సొంత ప్రయోగశాల లేదు.

నెయ్యి నాణ్యతపై అధికారులు గతంలో పరీక్షలు చేయలేదు. నాణ్యత నిర్ధరణ కోసం బయట ల్యాబ్స్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి. రూ.411కే కిలో నెయ్యి సరఫరా చేశారు. నాణ్యమైన నెయ్యిని అంత తక్కువ ధరకు సరఫరా చేయలేరు. మేం హెచ్చరించిన తర్వాత గుత్తేదారులు నాణ్యత పెంచారు" అని ఈవో తెలిపారు.

**జంతువుల కొవ్వు నెయ్యిలో కలిసినట్లు తేల్చిన ఎన్‌డీడీబీ :** "నాలుగు ట్యాంకర్లలో నెయ్యిని జులై 6న.. 10 ప్రయోగశాలలకు పంపాం. నెయ్యి నాణ్యత నిర్ధరణ కోసం ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపాం. ఎన్‌డీడీబీ చాలా ప్రముఖమైనది గుజరాత్‌లోని ఆనంద్‌లో ఉంది. ల్యాబ్ పరీక్షల్లో నెయ్యి నాణ్యత లేదని, భారీగా కల్తీ జరిగినట్టు నివేదికలు వచ్చాయి. వారంలో ల్యాబ్ నివేదికలు రెండు విభాగాలుగా ఇచ్చారు. నెయ్యి నాణ్యత 100 పాయింట్లకు బదులు 20 పాయింట్లే ఉంది. జంతువుల కొవ్వు నెయ్యిలో కలిసినట్లు ఎన్‌డీడీబీ తేల్చింది. తమిళనాడుకు చెందిన ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగింది.

నెయ్యి కల్తీ అయ్యిందని తేలిన వెంటనే చర్యలకు ఉపక్రమించాం. ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై కమిటీ వేశాం. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. నెయ్యి కల్తీ పరీక్ష కోసం బయటకు పంపడం తితిదే చరిత్రలో ఇదే తొలిసారి" అని ఈవో శ్యామలరావు చెప్పారు.




# హైకోర్టుకు చేరిన తిరుమల లడ్డూ వివాదం

అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదం హైకోర్టుకు చేరింది. శ్రీవారి లడ్డూ వ్యవహారంలో వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై దుష్ప్రచారం జరుగుతోందంటూ హైకోర్టును ఏపీ మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి ఆశ్రయించారు. ప్రసాదం తయారీకి జంతువుల కొవ్వు, చేప నూనె వాడారంటూ వైఎస్ జగన్‌పై జరుగుతున్న విష ప్రచారాన్ని ఆపేలా ఆదేశించాలని ఆయన హైకోర్టును కోరారు. దీనిపై వెంటనే కమిటీ వేసి విచారించాలని ఆయన ధర్మాసనాన్ని కోరారు. అయితే స్పందించిన హైకోర్టు ఇప్పుడు అత్యవసరంగా విచారణ చేయాల్సిన అవసరం లేదని, వచ్చే బుధవారం విచారణ చేపడతామని తెలిపింది.

**జగన్‌పై కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు..** మరోవైపు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్ర హోంశాఖకు ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ ఫిర్యాదు చేశారు. తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు, చేప నూనె వాడి జగన్ హిందువుల మనోభావాలు దెబ్బతీశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీ అధినేత తన చర్యలతో హిందువుల ఆత్మను హత్య చేశారని, వారి నమ్మకాలు, విశ్వాసాలను, తిరుమల ఆలయం పవిత్రతను ఘోరంగా మంటగలిపారని అన్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖతోపాటు ఏపీ, ఉత్తర్ ప్రదేశ్ డీజీపీలకు వినీత్ జిందాల్ ఫిర్యాదు చేశారు. వైసీపీ అధినేత జగన్?తోపాటు అప్పటి టీటీడీ పాలకవర్గం, జంతువుల కొవ్వు నెయ్యిని సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి చర్యలకు జగన్ పాల్పడ్డారని, విచారణ చేసి అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫ్యాన్ పార్టీ అధినేతతోపాటు ఇందుకు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై భారత న్యాయ సంహితలోని 152, 192, 196, 298, 353 సెక్షన్ల కింద వెంటనే కేసు నమోదు చేయాలని కోరారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద కూడా జగన్ మోహన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది వినీత్ జిందాల్ విజ్ఞప్తి చేశారు.

# లడ్డూ వివాదంపై స్పందించిన జగన్.. ఏమన్నారంటే..



అమరావతి, సెప్టెంబర్ 20: తిరుమల ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందంటూ వస్తున్న ఆరోపణలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పందించారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఖండించారు. ఒక సీఎం ఇలా అబద్ధాలు ప్రచారం చేయడం ఏంటని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవడం ధర్మమేనా? అని నిలదీశారు. శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడిన జగన్.. తిరుమల లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కల్తీ జరిగినట్లు వంద రోజుల తరువాత ఎందుకు బయటకొచ్చిందని ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే కల్తీ జరిగినట్లు తేలిందన్నారు. దశాబ్దాలుగా లడ్డూ తయారీ విధానంలో ఒకే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. 100 రోజుల పాలనలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేకపోయారని.. వారి వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి కొత్త వివాదాన్ని తెరమీదకు తీసుకువచ్చారని జగన్ ఆరోపించారు. లడ్డూ తయారీకి వాడే నెయ్యి కల్తీ అయ్యిందంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలు కట్టుకథ అని అన్నారు. చంద్రబాబు హయాంలోనూ క్వాలిఫై అవ్వని నెయ్యిని రిజెక్ట్ చేశారని జగన్ గుర్తు చేశారు. నెయ్యిలో జంతు కొవ్వు కలిపారని చెప్పడం న్యాయమేనా? అని ప్రశ్నించారు. శాంపిల్స్ క్వాలిఫై అని రిపోర్ట్ వచ్చిన తరువాతే నెయ్యి ట్యాంకర్‌ను తిరుమలకు పంపిస్తారని జగన్ వివరించారు. ప్రతి విషయంలోనూ డైవర్షన్ పాలిటిక్సే కనిపిస్తున్నాయని కూటమి ప్రభుత్వం తీరుపై జగన్ విమర్శలు గుప్పించారు. ఆటవిక పాలనపై ఢిల్లీ వెళ్లి ధర్నా చేస్తే మదనపల్లి ఫైల్స్ దగ్ధం పేరుతో డైవర్షన్ చేశారని.. స్కాముల్లో తనను అరెస్ట్ చేశారంటూ ఐఏఎస్, ఐపీఎస్‌లను వేధిస్తున్నారని జగన్ ఆరోపించారు. ముంబై నుంచి హీరోయిన్‌ను తీసుకొచ్చి మరో డైవర్షన్‌కు తెర తీశారని జగన్ ఆరోపించారు. ఆ భగవంతుడిని కూడా రాజకీయాలకు వాడుకోవడం ఏంటని అన్నారు జగన్. లడ్డూ తయారీ చేసే నెయ్యిలో జంతువుల కొవ్వు అనేది కట్టుకథ అని అన్నారు. ఇంతటి నీచమైన పనిని ఎవరైనా చేస్తారా? అని ప్రశ్నించారు. ఒక ముఖ్యమంత్రి ఇలా పచ్చి అబద్ధాలు చెప్పడం ఏంటన్నారు. ప్రతి 6 నెలలకు ఓసారి నెయ్యి సరఫరా కోసం టెండర్లు పిలుస్తారని.. నెయ్యి నాణ్యత నిర్ధారణ పరీక్షను ఎవరూ మార్చలేదన్నారు. దశాబ్దాలుగా జరుగుతున్న పద్ధతుల్లోనే తిరుమలలో లడ్డూ తయారీ జరుగుతోందని జగన్ స్పష్టం చేశారు. ఏళ్లుగా కొనసాగుతున్నట్లుగానే.. ఒకే విధానంలో లడ్డూ తయారీ సామాగ్రి కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు జగన్. నెయ్యి తెచ్చే ప్రతి ట్యాంకర్ %చీూదీూ% సర్టిఫికెట్ తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. ప్రతి ట్యాంకు శాంపిళ్లను మూడుసార్లు టెస్ట్ చేస్తారని.. మూడు టెస్టులు పాసైతేనే ఆ సామాగ్రిని టీటీడీ అనుమతిస్తుందని జగన్ చెప్పారు. చంద్రబాబు జరగనిది జరిగినట్లు అబద్ధాలు చెబుతున్నారని జగన్ విమర్శించారు. జులై 12న శాంపిల్స్ తీసుకున్నారని.. అప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడే ఉన్నారు కదా? అని జగన్ ప్రశ్నించారు. జులై 17న NDDBకి నెయ్యి శాంపిల్స్ పంపించారని.. NDDB ఆ రిపోర్ట్‌ను జులై 23న అందజేసిందన్నారు. మరి జులై 23న రిపోర్ట్ వస్తే ఇప్పుడు చంద్రబాబు మాట్లాడడం ఏంటని జగన్ అన్నారు.

# వైకాపా అంతమైనట్లే.. సజ్జల, విజయసాయిరెడ్డి కూడా ఉండరు: షర్మిల

అమరావతి: తిరుమల లడ్డూలో కల్తీపై కేంద్ర హోంశాఖకు లేఖ రాస్తామని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. "గవర్నర్‌ను కలిసి లడ్డూ కల్తీ వ్యవహారంపై ఫిర్యాదు చేస్తాం. వైకాపా విశ్వసనీయతను కోల్పోయింది. వైఎస్ఆర్ మంచి పేరు సాధిస్తే.. జగన్ చెడ్డపేరు తెచ్చుకున్నారు. హామీలు అమలు చేయకుండా గతంలో మోసం చేశారు. రుషికొండపై ఆయన కబ్జాలు చేశారు.

వైఎస్ఆర్‌కు జగన్‌కు పొంతనే లేదు. వైకాపా అంతం అయినట్లే.. ఆ పార్టీలో జగన్ తప్ప ఎవరూ మిగలరు. సజ్జల, విజయసాయిరెడ్డి కూడా అందులో ఉండరు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి" అని షర్మిల తెలిపారు.



# ముంబయి నటి ఫిర్యాదు.. వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ అరెస్ట్



విజయవాడ: బాలీవుడ్ నటి కాదంబరీ జత్వానీపై తప్పుడు కేసు పెట్టిన వ్యవహారంలో వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ ను పోలీసులు అరెస్టు చేశారు. జత్వానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక ఆధారాల సాయంతో వేరే రాష్ట్రంలో ఉన్న విద్యాసాగర్‌ను అరెస్టు చేశారు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు విద్యాసాగర్ తన స్నేహితుడి మొబైల్ వినియోగించారు. అయినా, సాంకేతికత సాయంతో నిందితుడిని పట్టుకున్నారు. ఫోర్జరీ పత్రంతో తనపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేశారని జత్వానీ ఇటీవల ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందులో ఐపీఎస్ అధికారులు సీతారామాంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్ని కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌ను ఏ1గా చేర్చారు. అతనితో పాటు మరికొందరు అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. తప్పుడు ఆధారాలను సృష్టించడం, నేరానికి పాల్పడినట్లు తప్పుడు ఆరోపణలు చేయడం, పత్రాలను ఫోర్జరీ చేయడం, తప్పుడు రికార్డులను తయారు చేయడం, తదితర ఆరోపణలపై ఐపీసీలోని 192, 211, 218, 220, 354 (డి), 467, 420, 469, 471 రెడ్ విత్ 120 (బి), ఐటీ చట్టంలోని 66ఏ సెక్షన్ల కింద కేసు పెట్టిన విషయం తెలిసిందే.

# భయంకరమైన.. నమ్మలేని నిజమిది: చిలుకూరు ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్



హైదరాబాద్: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీపై సమగ్ర విచారణ జరపాలని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్ కోరారు. 'భయంకరమైన, నమ్మలేని నిజమిది' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రత్యక్ష వైకుంఠ క్షేత్రమైన తిరుమలలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. టెండరింగ్ ప్రక్రియే తప్పు అని విమర్శించారు. నిజానిజాలపై విచారణ చేపట్టాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ మేరకు ఓ వీడియో సందేశాన్ని రంగరాజన్ విడుదల చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షిస్తున్నట్లు జాతీయ స్థాయిలో ధార్మిక పరిషత్ ఏర్పాటు చేస్తే ఇలాంటి దారుణాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి తిరుమల పవిత్రతను కాపాడాలని ఆయన కోరారు.

# డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్




చిత్తూరు: జిల్లాలోని బంగారుపాళ్యంలో మంత్రి నారా లోకేశ్ పర్యటిస్తున్నారు. యువగళంలో ఇచ్చిన హామీ ప్రకారం ఇవాళ (శుక్రవారం) కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. సెంటర్‌ను పరిశీలించిన లోకేష్.. రోగులతో మాట్లాడారు. అలాగే 30 పడకల ఆస్పత్రిని, ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మంత్రి నారా లోకేష్ మొక్కలు నాటారు. హాస్పిటల్‌లో కార్యక్రమాలు ముగిసిన అనంతరం బంగారుపాళ్యంలో లోకేష్ 'ప్రజా దర్బార్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని ఆయన అన్నారు. యువగళాన్ని అడ్డుకునేందుకు గత ప్రభుత్వం యత్నించిందని, కుట్రను ఛేదించుకుంటూ యువగళం యాత్ర సాగిందని లోకేశ్ ప్రస్తావించారు. వైసీపీ అధికారంలోకి వస్తే దశల వారీగా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని జగన్ అన్నారని, అది అమలు చేయకపోగా.. రాజారెడ్డి రాజ్యాంగం తీసుకొచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని మంత్రి లోకేష్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రశ్నించిన వారిపై దొంగ కేసులు పెట్టారని, జైల్లో పెట్టించారని విమర్శించారు. తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా 23 కేసులు పెట్టారని, ఫేక్ జగన్ చెప్పేవన్నీ అబద్ధాలేనని దుయ్యబట్టారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను రద్దు చేశారని, అడుగడుగునా జగన్ కుట్రలు పన్నుతున్నారని అన్నారు. తిరుమల లడ్డూలో కూడా నాణ్యత లేకుండా చేశారని లోకేష్ మండిపడ్డారు. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి మంత్రి లోకేష్ సవాల్ చేశారు. లడ్డూ నాణ్యతపై ప్రమాణం చేసేందుకు సుబ్బారెడ్డి సిద్ధమా? అని ప్రశ్నించారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని తెలిసి షాక్ అయ్యానన్నారు. లడ్డూ తయారీ నెయ్యిని కల్తీ చేశారని నివేదికలు వచ్చాయని, దేవుడి దగ్గర కూడా రాజకీయాలు చేశారని.. వ్యవస్థలను పూర్తిగా నాశనం చేశారని లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక పెన్షన్లను ఒకేసారి రూ.4 వేలకు పెంచామని, రాష్ట్రానికి పెట్టుబడులతో పాటు పరిశ్రమలను తీసుకొస్తున్నామన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. కాగా చిత్తూరు జిల్లాలో పర్యటించిన మంత్రికి గ్రామస్థులు తమ బాధలను వివరించారు. అనేక మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నట్లు వాపోయారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సెంటర్లను ఏర్పాటు చేసి ప్రారంభిస్తున్నామన్నారు. దీంతో లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



# గత ఐదేళ్లూ నిరభ్యంతరంగా ఈ మహాపాపం

తిరుమల: తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై తితిదే మాజీ ప్రధానార్చకులు రమణ దీక్షితులు స్పందించారు. తిరుమలలో ప్రసాదాల నాణ్యతపై గతంలో ఎన్నోసార్లు తితిదే ఛైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళ్లానని.. కానీ లాభం లేకపోయిందన్నారు. పవిత్రమైన ఆవు నెయ్యిని కల్తీ చేసి శ్రీవారి ప్రసాదాల్లో వినియోగించడం అపచారమని ఆవేదన వ్యక్తంచేశారు. తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో రమణదీక్షితులు మాట్లాడారు. "శ్రీవారి ప్రసాదాల నాణ్యతపై ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. నాది ఒంటరి పోరాటం అయిపోయింది. తోటి అర్చకులెవరూ వారి వ్యక్తిగత కారణాల వల్ల ముందుకురాలేదు. దీంతో గత ఐదేళ్లూ నిరభ్యంతరంగా ఈ మహాపాపం జరిగిపోయింది. నెయ్యి పరీక్షలకు సంబంధించిన ల్యాబ్ రిపోర్టులు చూశాను. నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు అందులో ఉంది. పరిశుభ్రమైన ఆవు పాలతో తయారైన నెయ్యిలో కొవ్వు పదార్థాలు కలిసేందుకు వీలు లేదు. తిరుమలను ప్రక్షాళన చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. దీనికోసం ఎన్నో చర్యలు చేపట్టారు. కర్ణాటకలోని నందిని డెయిరీ నుంచి నెయ్యిని వినియోగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం" అని రమణదీక్షితులు అన్నారు.

## ఉత్తరాదిన తారక మంత్రం ఫలిస్తుందా?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన దేవర పాన్ ఇండియా కేటగిరీలో అత్యంత భారీగా విడుదలవుతున్న సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 27... డే1 చాలా ప్రశ్నలు సమాధానం లభిస్తుంది. పూర్తిగా క్లారిటీ వచ్చే కీలకమైన రోజు అది. తెలుగు రాష్ట్రాలు సహా ఉత్తరాదినా ఈ సినిమాని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రిలీజ్ చేస్తున్నారు గనుక సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రభాస్ తర్వాత అత్యంత భారీ ప్రణాళికతో హిందీ మార్కెట్లోకి దూసుకెళుతున్న తెలుగు హీరోగా ఎన్టీఆర్ రికార్డులకెక్కుతున్నాడు. అయితే ప్రభాస్ రేంజులో అతడి పాచిక పారుతుందా? అంటే ఇప్పుడే చెప్పలేం. మల్టీస్టారర్ ఆర్.ఆర్.ఆర్ తో పోలిస్తే దేవర ఎన్టీఆర్ కి సోలో సినిమాగా పరిగణించాలి. బాలీవుడ్ హీరోయిన్.. బాలీవుడ్ విలన్ లను ఎంపిక చేసుకుని ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమాకి ఉత్తరాది బెల్ట్ లో ఏ మేరకు క్రేజ్ ఉంది? అన్నది ఇంకా అర్థం కాని గందరగోళంగా ఉంది. అయితే అన్నిటినీ అధిగమించేందుకు ఎన్టీఆర్- కొరటాల బృందం ఉత్తరాది ప్రమోషన్స్ కి అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఇటీవల దేవర బృందం



అంతా ముంబైలో పాగా వేసి ప్రచారంలో వేడి పెంచుతోంది. కపిల్ శర్మ షో సహా వీలున్న ప్రతి వేదికపైనా దేవరకు ప్రమోషన్ తగ్గనీయడం లేదు. మరోవైపు డిజిటల్ గాను తమ సినిమాని థియేటర్లలో చూడాల్సిందిగా ప్రచారం చేస్తున్నారు. ముంబైలోనే ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చేసారు గనుక అక్కడ లోకల్ సినిమా అన్న ఫీలింగ్ తేవడానికి ప్రయత్నించారు. ఆలియా లాంటి బిగ్ స్టార్ దేవరకు కావాల్సినంత ప్రమోషన్ చేస్తోంది. పైగా దిగ్గజం కరణ్ జోహార్ స్వయంగా రిలీజ్ చేస్తూ తేవాల్సిన బజ్ తెచ్చారు. రెండు వరుస బ్లాక్ బస్టర్లు అందుకున్న సందీప్ వంగా ప్రచారం దేవరకు అడ్వాంటేజ్. ఇవన్నీ ఎన్టీఆర్ సినిమాకి ఏమేరకు ప్లస్ అవుతాయో ఇంకా చెప్పలేం. ఏది ఏమైనా దేవరకు భారీ ఓపెనింగులు తేవడమే ధ్యేయంగా అటు ఉత్తరాదినా భారీ ప్రచారం చేస్తున్నారు. కంటెంట్ పరంగా అద్భుతంగా ఉంది అన్న టాక్ వచ్చి పాజిటివ్ సమీక్షలు పడితే దానికి తగ్గట్టే దేవర వసూళ్లకు ఢోఖా ఉండదు. ఇంతకుముందు విడుదలైన ట్రైలర్ కి మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. కానీ ట్రైలర్ తో పని లేకుండా సినిమాలో మ్యాటర్ ని ఎలివేట్ చేసి ఉంటే, జనతా గ్యారేజ్ తరహాలో ఆరంభ సమీక్షల్లో పాజిటివిటీ ఉంటే గనుక అది దేవర ఓపెనింగులకు కలిసిరావొచ్చు. ఇటీవల తెలుగు సినిమాలకు ఉత్తరాదిన వెయిట్ పెరిగింది. బాలీవుడ్ లో తెరకెక్కుతున్న భారీ మల్టీస్టారర్లలో మన తెలుగు హీరోలకు ప్రాధాన్యత పెరగడం కలిసొచ్చే అంశం. ఇది మన హీరోల మార్కెట్ రేంజును పెంచుతోంది. ఉత్తరాదిన నెమ్మదిగా మనవాళ్లు దూసుకుపోవడానికి దారి దొరికింది.

ఇదే అదనుగా దేవర1తో హిట్టు కొడితే ఎన్టీఆర్ నటించే దేవర 2 కి అది అన్నివిధాలా కలిసి వస్తుంది. బాహుబలి, సలార్ తరహాలో దేవరకు పాజిటివ్ సమీక్షలు పడాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి అంతా సస్పెన్స్. అసలేం జరగనుందో వేచి చూడాలి.

## శ్రీలీలపై ఫుల్ ఫోకస్.. అందుకేనా?

యంగ్ బ్యూటీ శ్రీలీల.. ఇండస్ట్రీలోకి వచ్చిన తక్కువ టైమ్ లోనే ఎక్కువ పాపులారిటీ, క్రేజ్ సంపాదించుకున్న విషయం తెలిసిందే. స్టార్ హీరోయిన్లకు ఏ మాత్రం తీసిపోదు అన్నట్లుగా ఫేమ్ ను దక్కించుకుంది అమ్మడు. అచ్చ తెలుగు అమ్మాయి అయినప్పటికీ కన్నడ మూవీ ద్వారా సినీ ఇండస్ట్రీకి పరిచయమైంది. శ్రీలీల డెబ్యూ మూవీ కిస్ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అయింది. ఆ తర్వాత రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన పెళ్లి సంద%ఆ% మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా యావరేజ్ టాక్ తెచ్చుకున్నప్పటికీ శ్రీలీల తన అందం, అభినయంతో మంచి పేరు సంపాదించుకుంది. ఆ తర్వాత రవితేజ ధమాకా మూవీలో యాక్ట్ చేసి ఒక్కసారి లైమ్ లైట్ లోకి వచ్చేసింది. సెన్సేషనల్ హీరోయిన్ గా మారి.. టాలీవుడ్ లో ఓ రేంజ్ లో అవకాశాలు అందుకుంది. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా తొమ్మిది ఆఫర్లు కొట్టేసింది. కానీ ఆమె నటించిన సినిమాల్లో నందమూరి బాలకృష్ణ భగవంత్ కేసరి మూవీ తప్ప మిగతా చిత్రాలు అన్నీ అంతగా మెప్పించలేకపోయాయి. దీంతో కాస్త స్లో అయిన శ్రీలీల.. ఇప్పుడు మళ్లీ ఫామ్ లోకి వచ్చేసి నాన్ స్టాప్ గా



షూటింగ్స్ లో పాల్గొంటోంది. బాలీవుడ్, కోలీవుడ్ లో తన సత్తాను ప్రూవ్ చేసుకోవాలని చూస్తోంది. పాన్ ఇండియా లెవెల్ లో పేరు సంపాదించుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. త్వరలోనే బీ టౌన్ లోకి అడుగుపెట్టనుంది. అయితే కొద్ది రోజులుగా నేషనల్ వైడ్ గా మీడియా దృష్టంతా శ్రీలీలపై పడ్డట్టు కనిపిస్తుంది. అందుకు కారణం తెలియకపోయినా.. ఫోకస్ పడిన విషయం మాత్రం నిజమనే చెప్పాలి. బాలీవుడ్ లోకి అమ్మడు ఎంట్రీ ఇవ్వనున్న నేపథ్యంలో ఇలా జరుగుతుందేమోనని కొందరు అంటున్నారు. బీ టౌన్ స్టార్, దేవర విలన్ సైఫ్ అలీ ఖాన్ వారసుడు ఇబ్రహీం అలీ ఖాన్ డెబ్యూ మూవీతో శ్రీలీల.. నార్త్ లోకి ఎంట్రీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇబ్రహీం హీరోగా చేస్తున్న దిలేర్ మూవీ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ తో రూపొందుతోంది. ఆ సినిమాలో హీరోయిన్ గా సౌత్ బ్యూటీ శ్రీలీలను ఫిక్స్ చేసినట్లు ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. త్వరలోనే అఫీషియల్ అనౌన్స్మెంట్ రానుందని తెలుస్తోంది. అదే సమయంలో మరో బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ సరసన హీరోయిన్ గా శ్రీలీల నటించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. బల్వీందర్ సింగ్ జంజువా దర్శకత్వంలో యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న చిత్రం మిట్టిలో శ్రీలీలను హీరోయిన్ గా ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అక్టోబర్ నెలలో ఆ మూవీ పట్టాలెక్కనుందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మరి సౌత్ లో మంచి క్రేజ్ సంపాదించుకున్న అమ్మడు.. నార్త్ లో ఎలా మెప్పిస్తుందో వేచి చూడాలి.




## రాక్షస నాయకుడి అరాచకాలు తెరపైకి?



నేనే రాజు నేనే మంత్రి లాంటి హిట్ సినిమాలో నటించాడు రానా దగ్గుబాటి. ఈ సినిమాకి తేజ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. ఈ మూవీ విజయం సాధించాక, సీక్వెల్ కూడా ఉంటుందని ప్రచారం సాగింది. తేజ స్వయంగా సీక్వెల్ కథ, స్క్రిప్టు రచన కోసం చాలా ఎక్కువ సమయం తీసుకున్నారు. మొత్తానికి స్క్రిప్టు సిద్ధమైనా కానీ, ఎందుకనో రానాతో ముందుకు వెళ్లలేకపోయాడు. అదే సమయంలో రానా సోదరుడు అభిరామ్ తో అహింస అనే సినిమా తీసాడు. కానీ డెబ్యూ హీరో సినిమా డిజాస్టరవ్వడం తేజను తీవ్రంగా నిరాశపరిచింది. కారణం ఏదైనా కానీ, రానాతో తేజ సినిమా అంతకంతకు ఆలస్యమైంది. అయితే అంత డిలే అయినా కానీ ఈ ప్రాజెక్ట్ క్యాన్సిల్ కాలేదు. కేవలం వాయిదాల ఫర్వంలో మాత్రమే ముందుకు వెళుతోంది. ఇంతకుముందే దీనికి రాక్షస రాజు అనే టైటిల్ ని కూడా ప్రకటించారు. కానీ టైటిల్ ప్రకటించినంత మాత్రాన సెట్స్ కెళతారు అనుకుంటే పొరపాటే. ఇప్పటికీ దీనికి సంబంధించిన సరైన సమాచారం లేకపోవడం నిరాశపరుస్తోంది. చివరికి తేజ తన వారసుడి డెబ్యూ మూవీ సన్నాహకాల్లో ఉండడంతో రానా తో మూవీ గురించి ఆలోచించడం లేదని గుసగుస వినిపిస్తోంది. రాక్షస రాజు టైటిల్ బావుంది.. తేజ రాసుకున్న స్క్రిప్టు అద్భుతంగా ఉంది. ఇది రాక్షస లక్షణాలున్న నాయకుడి కథ. రెగ్యులర్ నాయకుడితో పోలిస్తే పదింతలు ఇంటెన్సిటీ ఎక్కువ ఉంటుందని చెబుతున్నారు. సరిగా తెరకెక్కిస్తే హిట్టు పడ్డట్టేనని టాక్ కూడా ఉంది.

కానీ ఈ సినిమాకి తేజ దర్శకత్వం వహించే కంటే ఎవరైనా డెబ్యూ దర్శకుడితో పట్టాలెక్కిస్తే బావుంటుందని దగ్గుబాటి రానా భావిస్తున్నట్టు ప్రముఖ మీడియా కథనం పేర్కొంది. అయితే ఆ దర్శకుడు ఎవరు? సెట్స్ కి ఎప్పుడు వెళతారు? అనే వివరాలేవీ బయటకు రాలేదు. దీనికి కాలమే సమాధానం ఇస్తుందేమో చూడాలి.

## ఉత్సవం.. సక్సెస్ మీట్‌లో చిత్ర యూనిట్ జోష్




తెలుగు సినీ పరిశ్రమలో ఇటీవల హార్ట్ ఫుల్ ఎంటర్టైనర్ సినిమాలకు అద్భుతమైన రెస్పాన్స్ దక్కుతోంది. ఇక రీసెంట్ గా అదే జానర్ లో వచ్చిన ఉత్సవం గత ఫ్రైడే రిలీజ్ అయ్యింది . హీరో దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు అర్జున్ సాయి రచన మరియు దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని హార్న్‌బిల్ పిక్చర్స్ నిర్మించింది. సక్సెస్ మీట్ సందర్భంగా మేకర్స్ వారి ఆనందాన్ని పంచుకున్నారు. దిలీప్ ప్రకాష్ మాట్లాడుతూ, “ముందుగా మీ అందరికీ నమస్కారం. మా సినిమా చూసి స్పందించిన ప్రతి ఒక్కరికీ థాంక్ యూ. మీడియా కూడా మా సినిమా ప్రమోషన్‌లో సపోర్ట్ చేసింది, అందుకు ప్రత్యేక ధన్యవాదాలు. మా చిత్రం సక్సెస్ టూర్ చేయబోతున్నాం, అందరూ ఈ సినిమా చూడండి” అని అన్నారు. యాక్టర్ అలీ మాట్లాడుతూ, “నాటక రంగం నుండి వచ్చిన కళాకారులందరూ పరిశ్రమలో ఎదిగారు. సురభి నాటక రంగం వారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఉత్సవం వంటివి మంచి సినిమాలను ప్రేక్షకులు ప్రోత్సహించాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా ద్వారా మంచి నటీనటులతో కలిసి పని చేసే అవకాశం దక్కింది” అని అన్నారు. డైరెక్టర్ అర్జున్ సాయి మాట్లాడుతూ, “నాటకం గొప్ప కళ. నాటకాన్ని ఆధారంగా తీసుకుని నా మొదటి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో లవ్ స్టోరీ మరియు ఫ్యామిలీ డ్రామా ఉంది, ప్రముఖ నటీనటులు అందరూ కూడా వారి టాలెంట్ తో సినిమాను మరో లెవెల్ కు తీసుకు వెళ్లారు. చూసిన ప్రతీ ఒక్కరు కూడా అద్భుతమైన ప్రయత్నం అని ప్రశంసలు అందిస్తున్నారు” అని తెలిపారు. నిర్మాత సురేష్ పాటిల్ మాట్లాడుతూ, “ఈ కథలో లవ్ స్టోరీ మరియు గొప్ప కళాకారులు ఉన్నారు.తప్పకుండా అందరూ ఈ సినిమాను చూసి మరింత సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. ప్రేక్షకుల సపోర్ట్ ఉంటే మరిన్ని సినిమాలు చేస్తాను” అన్నారు. రైటర్ రమణ గోపిశెట్టి మాట్లాడుతూ, “ఈ సినిమాకు మంచి పేరు వస్తోంది. ఇందులో అద్భుతమైన లవ్ స్టోరీ ఉంది. దర్శకుడు చాలా మంచి పని చేశాడు,” అన్నారు. ఇక యాక్టర్ వెంకట గిరిధర్ మరియు అభినయ కృష్ణ కూడా తమ అభిప్రాయాలు పంచుకున్నారు, “ఈ సినిమా మాన్ కల్చర్ మరియు నాటకంపై అద్భుతంగా చూపించింది. దిలీప్ చాలా నేచురల్‌గా పెర్ఫామ్ చేశాడు” అని పేర్కొన్నారు.

## దేవర.. ఫ్యాన్స్ కోసం ప్రత్యేకంగా...

ఫ్యాన్స్ బెన్ ఫిట్ షోలు అనేది రెండు దశాబ్దాల నుంచి టాలీవుడ్ ఇండస్ట్రీలో నడుస్తోంది. గతంలో మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణ సినిమాలకి ఇలా బెన్ ఫిట్ షోలు వేసేవారు. ప్రత్యేకంగా ఫ్యాన్స్ కోసం మాత్రమే ఈ బెన్ ఫిట్ షోలు వేస్తారు. అర్ధరాత్రి ఒంటిగంటకి, ఉదయం నాలుగు గంటలకి ఇలాంటి బెన్ ఫిట్ షోలని థియేటర్స్ లో వేస్తారు. ఫ్యాన్స్ అసోసియేషన్ లో ఉన్నవారే ఈ బెన్ ఫిట్ షోల కోసం థియేటర్స్ లో ఒక షో బుక్ చేసుకుంటారు. ఆ షో మొత్తానికి ఇన్ని లక్షలు అని డిస్ట్రిబ్యూటర్స్ తో మాట్లాడుకుంటారు. డిస్ట్రిబ్యూటర్స్ కూడా మంచి ధర చూసుకొని ఫ్యాన్స్ బెన్ ఫిట్ షోలు వేసుకోవడానికి అవకాశం ఇస్తారు. అయితే చారిటీ షోలుగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొని ఈ షోలని ఏర్పాటు చేస్తూ ఉంటారు. టికెట్ ధరలు కూడా వేలల్లో పెడతారు. అయితే డిస్ట్రిబ్యూటర్స్ నేరుగా ఐదు షోలకి పర్మిషన్ తెచ్చుకుంటున్న తర్వాత ఫ్యాన్స్ బెన్ ఫిట్ షోలు చాలా వరకు తగ్గిపోయాయి. అలాగే టికెట్ ధరలు కూడా భారీగా పెంచుకోవడానికి ప్రభుత్వాలు పర్మిషన్ ఇస్తున్నాయి. ఇది డిస్ట్రిబ్యూటర్స్



కి అనుకూలిస్తుండటంతో ఇలాంటి ఫ్యాన్స్ బెన్ ఫిట్ షోలు పెద్దగా వేయడం లేదనే చెప్పాలి. ఈ ఏడాది ‘గుంటూరు కారం’ సినిమాకి కొన్ని చోట్ల ఇలాంటి ఫ్యాన్స్ బెన్ ఫిట్ షోలు పడ్డాయంట. అయితే ముందుగానే డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ లోనే టికెట్ ధరలు ఫిక్స్ చేసి అమ్మారని టాక్. ఇప్పుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ ‘దేవర’ సినిమాకి కూడా ఫ్యాన్స్ బెన్ ఫిట్ షోలు కన్ఫర్మ్ అయ్యాయనే ప్రచారం నడుస్తోంది. ఇది ఎంత వరకు వాస్తవమో తెలియదు. అయితే ఈ సారి నేరుగా డిస్ట్రిబ్యూటర్స్ ఈ ఫ్యాన్స్ బెన్ ఫిట్ షోల కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలని అనుకుంటున్నారంట. చారిటీ షోలుగా పేరు పెట్టి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంటే డైరెక్ట్ గా థియేటర్స్ వద్దనే టికెట్ రేట్లు 1000, 2000 ధరలకు అమ్మొచ్చు. ఇలా అమ్మడం ద్వారా కలెక్షన్స్ కూడా భారీగా వస్తాయి. ఇది ఓవరాల్ గా మొదటి రోజు కలెక్షన్స్ లోకి వస్తుంది. భారీ కలెక్షన్స్ రికార్డ్ చూపించుకుని ఛాన్స్ కూడా దొరుకుతుందనే మాట వినిపిస్తోంది. మరి సోషల్ మీడియాలో జరుగుతోన్న ఈ ప్రచారంలో వాస్తవం ఎంత అనేది తెలియదు. ఒక వేళ వాస్తవమైన ప్రభుత్వం ఇలా భారీ ధరకి టికెట్లు అమ్ముకోవడానికి పర్మిషన్ ఇస్తుందా అనేది చెప్పలేం.

## ఆషు రెడ్డి.. లెగ్స్ అందాలతో స్టన్నింగ్

సోషల్ మీడియా ద్వారా మంచి క్రేజ్ అందుకున్న వారిలో ఆషు రెడ్డి ఒకరు. జూనియర్ సమంత అని క్రేజ్ అందుకున్న ఆమె, తన షార్ట్ వీడియోల ద్వారా ఫేమస్ అయ్యింది. ఆషు రెడ్డి తన అందంతోనే కాదు, బోల్డ్ మరియు వినోదాత్మక ప్రదర్శనతో ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. రియాలిటీ షో “బిగ్ బాస్” లో పాల్గొన్న తర్వాత ఆమె పాపులారిటీ అమాంతం పెరిగిపోయింది. అప్పటి నుండి ఆమెకు ఉన్న క్రేజ్ క్రమంగా పెరుగుతూ వచ్చింది. తాజాగా, ఆషు రెడ్డి తనకు ఇష్టమైన డ్రెస్ లో తీసుకున్న ఫోటోలను ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేయగా, అవి సెకన్లలోనే వైరల్ అయ్యాయి. ఈ కొత్త లుక్స్ లో ఆమె స్లిమ్ మరియు స్టైలిష్ గా కనిపిస్తూ, ఫ్యాన్స్ నుండి పాజిటివ్



రెస్పాన్స్ అందుకుంది. ఫ్యాషన్ సెన్స్‌తో అమ్మడు లెగ్స్ అందాలతో ఆకట్టుకుంటోంది. ఫోటోషూట్‌లో ఆమె డ్రెస్ మరియు లుక్స్‌కు మాత్రమే కాకుండా, తన గ్లామర్ షోకు కూడా ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. పొట్టి డ్రెస్సులో ఉన్న ఆమె లుక్స్, సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఫాలోవర్స్ ఆమె లుక్స్ పై ప్రశంసల జల్లు కురిపించారు. ఒక్క ఫోటోతోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడంతో, ఆమె క్రేజ్ ఏమిటో మరోసారి రుజువు చేసింది. ఆషు రెడ్డి కేవలం సోషల్ మీడియా స్టార్ మాత్రమే కాదు, సిల్వర్ స్క్రీన్ మీద కూడా తన ప్రతిభను నిరూపించుకుంది. “చల్ మోహన రంగా”లో సహాయ నటిగా కనిపించిన ఆమె, “బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్” చిత్రంలో హీరోయిన్ గా నటించి మంచి గుర్తింపు పొందింది. ప్రస్తుతం “ఏ మాస్టర్ పీస్” అనే సూపర్ హీరో మూవీతో పాటు మరికొన్ని ప్రాజెక్ట్స్ కూడా ఆమె చేతిలో ఉన్నాయి. ఆమె ప్రతి సినిమాతో కూడా తన నటనలో కొత్తదనం చూపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. మరి రాబోయే రోజుల్లో అమ్మడు ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి.

